

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



గురువారం 30-07-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 113 రూ॥ 6.00

# హైడ్రాకు కొత్త కోరలు..!

## కొత్త హైడ్రా చట్టాన్ని అమల్లోకి తేనున్న ప్రభుత్వం

### ఈ చట్టంతో హైడ్రా అధికారులకు మరింత పదును






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

చెరువుల ఆక్రమణలు తొలగింపు చేసి చెరువులను, కుంటలను,సుందరీకరణంగా మార్చిన హైడ్రా ( ఫైల్ )





- కబ్జాదారులు తప్పించుకోవడం సాధ్యం కాదు
- ఇప్పటివరకు 1810 ఎకరాలను ఆక్రమణల నుంచి విముక్తి
- ఈ భూముల విలువ రూ. 1.20 లక్షల కోట్లకు పైమాటే



హైడ్రా ఉండాలంటూ హైడ్రా కు మద్దతుగా నిలుస్తున్న ప్రజలు ( ఫైల్ )




చిన్నారులు సైతం హైడ్రా కు కృతజ్ఞతలు (ఫైల్ )







- హైడ్రా సాధించిన విజయాలు సామాన్యమైనవి కావు
- లోతుకుంట భూముల విషయంలో ధిక్కారంగా పరిగణించిన కోర్టు
- హైడ్రా కమిషనర్ తొలగింపునకు ఆదేశాలు
- దీనిపై అప్పీలుకు వెళ్లనున్న ప్రభుత్వం
- అధికార పరిధులను ప్రస్తావించనున్న రాష్ట్ర ప్రభుత్వం

### హైడ్రా విజయాలు

| | |
|---|---|
| అక్రమ నిర్మాణాలు కూల్చివేత | 12,760+ |
| చెరువుల ఆక్రమణలు తొలగింపు | 1,950+ ఎకరాలు |
| నాలాల పరిరక్షణ | 150+ కి.మీ. |
| ప్రజా ఫిర్యాదుల పరిష్కారం | 8,600+ |
| ప్రభుత్వ భూములు రక్షణ | 5,300+ ఎకరాలు |

భూ ఆక్రమణల నుండి ప్రభుత్వం భూమికి రక్షణ హైడ్రా (ఫైల్ )



హైడ్రా రెండేళ్ల విజయోత్సవానికి ప్రజల ర్యాలీ ( ఫైల్ )









08లో

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా అప్పీలుకు వెళ్లే అవకాశం
- శాఖల మధ్య సమన్వయ లోపమే ఈ స్థితికి కారణం



నిష్పక్షపాత కర్తవ్య నిర్వహణం

22nd ANNIVERSARY

వసంతాల ఆత్మగౌరవం 2004-2026

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



గురువారం 30-07-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 113 రూ. 6.00





చీఫ్ ఎడిటర్

కట్టా రాఘవేందర్ రావ్

9063524136, 9908658888


# అసమానతలు ఆగవు..

# కులాలు మధ్య గోడలు కూలవు!!

ఎక్స్‌క్లూసివ్ నేటిధాత్రి Exclusive




## అవసరాన్ని బట్టి ఉన్నత వర్గాలు అందించే రాజకీయాల క్రీడలు!

- ఓ వైపు రిజర్వేషన్లు వద్దని అంటారు.
- మరో వైపు అగ్ర కులాలకు 10 శాతం రిజర్వేషన్స్ పొందారు.
- స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్నా రిజర్వేషన్లు ఎందుకంటారు!
- బీసీలలో బీసీలకే చిచ్చు పెడతారు.
- బీసీలు ఒకరినొకరు కలవకుండా చేస్తారు.
- అందరికీ సమాన అవకాశాలు అందాలంటారు.
- ఎన్నికలప్పుడు టిక్కెట్లు అగ్ర వర్ణాలే తీసుకుంటారు.
- ఎన్నికలలో ఓడినా గెలిచినా ఆ నాయకులు బతికున్నంత కాలం టిక్కెట్లు వాళ్లే తీసుకుంటారు.
- బీసీ లను నిలబెట్టినట్లే నిలబెట్టి ఓడిస్తారు.
- ఆ సమయంలో ఓసీ లంతా ఒక్కటైపోతారు.
- బీసీ లను రెచ్చగొట్టి బీసీ లనే ఓడిస్తారు.
- డబ్బు రాజకీయం పెరిగిన తర్వాత బీసీల రాజకీయానికి విలువ లేకుండా చేశారు.
- టిక్కెట్లు ఇచ్చేప్పుడు ఎంత ఖర్చు చేస్తావని అడుగుతుంటారు.
- ఆ బీసీ నాయకుడి వల్ల సమాజానికి ఎంత మేలు అనేది చూడడం లేదు.
- బీసీ లలో గొప్ప నాయకులున్నా డబ్బు తూకం వేస్తున్నారు.
- ఉద్యోగాల విషయంలో రిజర్వేషన్లు వద్దంటారు.
- రాజకీయాలలో బీసీ అనగాదొక్కుతూనే వుంటారు.
- సామాజిక న్యాయం అని సొల్లు చెబుతుంటారు.
- సమాజంలో అందరూ ఒక్కటే అని మాయ మాటలు చెబుతారు.
- దళితులను గుడిలోకి రానివ్వరు.
- సమాజంలో అన్ని వర్గాలు ఏకం కాకుండా చూస్తారు.
- ఎప్పటికప్పుడు అందరం ఒక్కటే అని నమ్మించి మోసం చేస్తారు.
- ఇంకా వెయ్యేండ్లు ఐనా కులాలు పోనివ్వరు.
- అంతరాలు తగ్గనివ్వరు.. ఒకరినొకరు కలవనివ్వరు.
- కులానికి ఒక్కరిని ప్రోత్సహిస్తారు.. పార్టీల భజన చేయిస్తారు.
- వాళ్ళతోనే ఇతర కులాలను తిట్టిస్తారు.
- ఉన్నత కులాలలో ఒకరినొకరు తిట్టుకునే సందర్భమే రానివ్వరు.

### రాజకీయాల్లో అసమానత!

| అగ్రవర్ణాలు (5-7%) | బీసీలు (57%) | ఎస్సీలు (17%) | ఎస్టీలు (11%) |
|---|---|---|---|
| 10% రిజర్వేషన్ | 27% రిజర్వేషన్ | 17% రిజర్వేషన్ | 11% రిజర్వేషన్ |
| తక్కువ మార్కులతోనూ ఉద్యోగాలు! ఓపెన్ కోటాలో అధిక ప్రాధాన్యం! | దామాషా ప్రకారం కనీసం 50% రావాలి కానీ కేవలం 27% మాత్రమే! | | |

59% దామాషా - 50% న్యాయం కావాలి!

### రాజకీయాల్లో బీసీలకు న్యాయం ఎక్కడ?

- ✗ జనరల్ సీట్లలో అగ్రవర్ణాల ఆధిపత్యం!
- ✗ బీసీలకు టికెట్లు ఇస్తారు... ఇచ్చినా గెలవనివ్వరు!
- ✗ బీసీ ముఖ్యమంత్రి? ఇప్పటివరకు కలగానే!
- ✗ వారసత్వ రాజకీయాలు అగ్రవర్ణాలకే!
- ✗ బీసీ ఐక్యత అంటే భయం... అందుకే విభజన!



హైదరాబాద్, నేటిధాత్రి:

అసమానతలు ఆగాలి. కులాలు పోవాలి. మతాల మధ్య ద్వేషబావాలు తగ్గాలి. చెప్పుకోవడానికి, వినడానికి బాగానే వుంటాయి. కాని ఆచరణకు వచ్చే సరికి సాధ్యమౌతాయా? శతాబ్ధాలుగా ఇవే మాటలు చెబుతున్నారు. వింటున్నారు. తమ భావాలను వ్యక్తం చేస్తున్నారు. సమ సమాజమంటున్నారు. కాని ఏమౌతోంది. మరింతగా సమానత్వం ముసుగులో అసమానత్వమే కనిపిస్తోంది. బడుగు బలహీన వర్గాలలో తారతమ్యమే కనిపిస్తోంది. ఇప్పటికీ మన సమాజంలో దళితులు ధైర్యంగా వారి వారి గ్రామంలోని గుడిలోకే వెళ్లలేని పరిస్ధితులున్నాయి. ఆ అసమానతల మీద అనేక సినిమాలు కూడా వచ్చాయి. స్కూళ్లో ఓ దళిత స్టూడెంటు కుండలో నీళ్లు తాగిండని టీచరే కొట్టారన్న వార్తలు కూడా విన్నాం. విద్యార్ధులను చైతన్యం చేసి, వారిలో సమ భావన నింపాల్సిన గురుస్ధానంలో వున్న వాళ్లే దళితుల పట్ల ఆమానుషంగా ప్రవర్తిస్తే, సమాజానికి మంచి చెడులు ఎవరు నేర్పుతారు. రేపటి సమాజాన్ని ఎవరు బాగు చేస్తారు. గతంలో పరిస్ధితులు ఎలా వుండేవో తెలియందికాదు. ఆ కాలంలోనే రాజారామ్‌మోహన్‌రాయ్ లాంటి వాళ్లు సమాజంలో మార్పుకోసం ఎంతో శ్రమించారు. అసమానతలు తగ్గాలని వందేళ్ల క్రితమే పోరాటాలు చేశారు. కాని ఏమైంది. సనాతని అనే ధర్మమే రాజ్యమేలుతుందే తప్ప, అందరూ సమానమనే భావన ఎంత మందిలో వుంది. అవసరాన్ని బట్టి రాజకీయ పార్టీలు ఆడించే నాటకంలో ప్రజలంత పావులుగా మారుతున్నారే తప్ప మేలుకున్న సమాజం ఎక్కడ కనిపిస్తోంది. బడుగు బలహీన వర్గాలేమో రిజర్వేషన్లు వుండాలంటారు. ఉన్నత వర్గాలేమో రిజర్వేషన్లు వద్దంటారు. ఆఖరుకు ఉన్నత వర్గాలలో కూడా పేద ప్రజల సంగతేమిటిని ప్రశ్నించడం మొదలు పెట్టారు. వారి రిజర్వేషన్లు వారు సంపాదించుకున్నారు. అయినా మళ్లీ రిజర్వేషన్లు వద్దనే నినాదం చేస్తున్నారు. ఈ మాత్రం రిజర్వేషన్లే వుంటేనే సరైన ఉపాధి, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కొన్ని వర్గాలకు అందడం లేదు. కొన్ని కులాలకు ఇంకా రాజకీయ అవకాశాలు రానేలేదు. స్వాతంత్ర్యం వచ్చిన 80 సంవత్సరాలకు కూడా ఇంకా కొన్ని కులాలు చట్ట సభల ముఖం చూసింది లేదు. ఆ సభల్లో కూర్చునే అవకాశం వచ్చింది లేదు. అయినా రిజర్వేషన్లు వద్దని అగ్ర వర్గాలు చిలక పలుకులు చెబుతునే వుంటారు. జనరల్ స్ధానాల పేరు చెప్పి, సమాజంలో కనీసం 7శాతానికి మించని అగ్ర వర్ణాల ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రుల్లో మెజార్టీ నెంబర్ వాళ్లదే వుంటుంది. తెలంగాణలో వున్న 119 ఎమ్మెల్యే సీట్లలో మెజార్టీ ఎమ్మెల్యేలంతా అగ్ర వర్ణాలే వుంటారు. మంత్రి వర్గాలలోనూ వాళ్లే కనిపిస్తారు. అగ్ర వర్ణాలంతా కలిపినా కనీసం ఐదు నుంచి ఏడు శాతం మించి వుండరు. కాని వాళ్లకు పది శాతం రిజర్వేషన్ అమల్లో వుంది. అగ్ర వర్ణ పేదలకు ఎంత తక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగాలు సంపాదించుకుంటున్నారు. మరోవైపు ఓపెన్ కోటాలో ఎక్కువ ఉద్యోగాలు పొందుతున్నారు. చదువుకోగల ఆర్ధిక స్ధోమత వాళ్ల సొంతమే అవుతుంది. ఆర్ధిక స్ధోమత లేకపోయినా రిజర్వేషన్ పరంగా పది శాతం అందుకుంటూ ఉద్యోగాలు పొందుతున్నారు. అదే సమాజంలో 57శాతం వున్న బిసిలకు కేవలం 27శాతం రిజర్వేషన్ అమలు జరుగుతోంది. దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలు జరిగినా 50శాతం ఉద్యోగాలు బిసిలకు అందాలి. రిజర్వేషన్లు 59శాతానికి మించొద్దన్న నిబంధనలల్లో లొసుగులను కూడా వాడుకుంటున్నది అగ్రవర్ణాలే! పట్టు 5శాతం లేని అగ్రవర్ణాలు, ఆర్ధిక వెనుకబాటు నెపంతో 10శాతం ఉద్యోగాలు పొందుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలకన్నా తక్కువ మార్కులు వచ్చినా కొలువుల్లో చేరుతున్నారు. ఇదెక్కడి న్యాయం అడిగేందుకు ఇతర వర్గాలకు నోరు రాదు. కాని మాకెందుకు రిజర్వేషన్లు లేవని ప్రశ్నించిన అగ్రవర్ణాలకు మాత్రం అడిగిందే తడువుగా పదిశాతం రాసిచ్చేశారు. అదే ఎస్సీలు 27శాతం వున్నా, వారికి 17శాతమే రిజర్వేషన్ అమలు జరుగుతోంది. ఎస్టీలు 17శాతం వున్నా, 11శాతమే అమలు జరుగుతోంది. యాభై సంవత్సరాలుగా పేద బలహీన వర్గాలు మాకు రిజర్వేషన్లు పెంచండి అని ఎంత మొత్తుకున్నా, అరణ్య రోధనే మిగులుంది. కాని మేం అన్యాయమైపోతున్నాం..అగ్ర వర్గాలలో పుట్టడమే మేం చేసుకున్న పాపమా అని ప్రశ్నించిన వారికి మాత్రం పది శాతం ఇచ్చి ప్రసన్నం చేసుకున్నారు. అయినా ఇంకా రిజర్వేషన్లు ఎందుకు? అని ప్రశ్నిస్తున్నట్లు నటిస్తారు. మొసలి కన్నీళ్లు కారుస్తారు. ప్రజలను మాయ చేయడంలో ఆరి తేరిపోయారు. ఇతర బిసి వర్గాలను ఎదకుండా అణచి వేసే రాజకీయాలు చేస్తుంటారు. జనరల్ కోట కింద అన్ని సీట్లలో పోటీ చేసి గెలిచేది అగ్రవర్ణాలే. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు పోను మిగతా సీట్లలో నిలబడేది అగ్ర వర్ణాలే. పట్టు మని పది మంది బిసిలకు కూడా టిక్కెట్లు ఇవ్వరు. ఇచ్చినా బిసిలను గెలవనివ్వరు. గెలిచినా పదవుల్లో అన్యాయమే చేస్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇంత వరకు ఉమ్మడి రాష్ట్రంలో గాని, ఇప్పుడు తెలంగాణలో గాని ఏ ఒక్కబిసి సిఎం. కాలేదు. భవిష్యత్తులో అవుతారన్న నమ్మకం లేదు. సామాజిక న్యాయం అంటారు. సమ సమాజమని మాయ మాటలు చెబుతారు. అంతే కాని రాజకీయం దగ్గరకొచ్చే సరికి త్యాగం చేయడానికి ఏ అగ్ర వర్ణ నాయకుడు ముందుకు రారు. చట్ట సభలకు రిజర్వేషన్లు వుండడం వల్ల ఎస్సీ, ఎస్టీలు బతికిపోతున్నారు. పోటీ చేయగలుతున్నారు. లేకుంటే వాళ్లను గ్రామ పొలిమేరల్లోకి కూడా రానిచ్చేవారు కాదు. పదవుల వైపు చూడనిచ్చేవారు కాదు. సమాజంలో కలవనిచ్చేవారే కాదు. బిసిలలో వరుసగా వారసత్వంగా రాజకీయాలు చేసిన కుటుంబాలే కనిపించవు. కాని తరతరాలుగా అగ్ర వర్ణాల నాయకులు, మాత్రం వాళ్ల వారసులే ఇంకా రాజకీయాలు చేస్తున్నవారున్నారు. పదవులు పొందుతున్నారు. ఆదిప్యతం చేస్తున్నారు. ఎన్నికల సమయం వచ్చే సరికి ఓసిలంతా ఒక్కటౌతారు. బిసిలను కులాల వారిగా విభజించి రాజకీయం చేస్తారు. బిసిల ఐక్యతకు ఎప్పటికప్పుడు గండి కొడుతుంటారు. బిసిలు ఐక్యంగా వుండాలని ఏ ఒక్క రాజకీయ పార్టీకోరుకోదు. కులాల బవనాలు, రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇండ్లు ఇలాంటి సదుపాయాల కల్పన పేరు చెప్పి, బిసిలను రాజ్యాధికారం వైపు చూడాకుండా చేశారు. బిసిల ఎదుగుదలను మొదట్లోనే అణిచివేశారు. ఒక వేళ రాజకీయంగా ఏ బిసి అయినా ముందుకొస్తున్నాడంలే ప్రోత్సహించేందుకు ఏ అగ్ర వర్ణ నాయకుడికి చేతులు రావు. బిసిలను బిసిలతోనే నిందిస్తారు. ఎన్నికల్లో ఓడిస్తారు. రాజకీయం దరిదాపుల్లోకి కూడా రానివ్వకుండా చూసుకుంటారు. డబ్బు రాజకీయం పెరిగిన తర్వాత బిసిల రాజకీయానికి విలువ లేకుండా చేశారు. బిసిలలో ఐక్యత అనే మాట వినిపిస్తే చాలు..అగ్రవర్ణాలంతా ఒక్కటైపోతారు. బిసిలను ఐక్యతను చీలికలు, పీలికలు చేస్తారు. ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే సమయంలో ఎంత ఖర్చు చేస్తావని భయపెట్టేస్తారు. బిసిలలోనే తోటి బిసి నాయకుల చేత తూకం వేసి ఎంపిక చేస్తారు. దాంతో ప్రజలకు ఎంత సేవ చేసినా, ప్రజల్లో ఎంత పేరున్నా, ప్రజలకు ఎంత దగ్గరగా వున్న నాయకుడైనా సరే కావాలని దూరం పెడతారు. ఆ నాయకుడు ఎదిగితే అగ్ర వర్ణాల రాజకీయాన్ని నిలదీస్తారని ముందే పసిగట్టి పక్కన పెట్టేస్తారు. సమయానుకూలంగా ఓసిలంతా ఏకమై రాజకీయం చేస్తారు. బిసిలలో ఒకరినొకరు కలవకుండా విభజించి పాలించే రాజకీయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి మరీ చేస్తారు. అయినా బిసిలు కళ్లు తెరవరు. తెరిచినా ఆ ఐక్యత మూడు నాళ్లు చూపించుకోలేరు. ఓ వైపు సామాజిక న్యాయం అని సొల్లు చెబుతుంటారు. అందరం ఒక్కటే అని మాయ మాటలు చెబుతారు. ఎన్నికల్లో గట్టేక్కేందుకు అందరం ఒక్కటే అంటారు. గెలిచిన తర్వాత వాళ్ల విశ్వరూపం చూపిస్తారు. ఇంకా వెయ్యేండ్లయినా సరే కులాలు పోనివ్వరు. కులాల కుంపటి రగిలిస్తూనే వుంటారు. పైగా మనది కుల వ్యవస్ధ మీద ఆదారపడి నిర్మాణం జరిగిన సమాజమని కొత్త కొత్త బాష్యాలు చెబుతారు. ఇప్పుడు తీసేసుకుంటే పోయేది కాదు. వద్దన్నా మనతో కులం రాకుండా వుండదు? అని సరికొత్త నిర్వచనాలు చెబుతుంటారు. పనిలో పనిగా రిజర్వేషన్లు వద్దని అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులు వినిపిస్తారు.



# నేటిధాత్రి

22ND ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక



గురువారం 30-07-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 113 రూ॥ 6.00


# పరీక్షల లీకేజీలకు ఇక కఠిన శిక్షలు



- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- పదేళ్ల జైలు.. రూ.10 కోట్ల జరిమానా
- వందేమాతరానికి చట్ట రక్షణ.. పార్లమెంట్‌లో వాడీవేడి చర్చలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి :
పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. వాడీవేడీ చర్చలు, విమర్శలు--ప్రతివిమర్శల మధ్య బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది.
పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును కాపాడడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని కేంద్రం స్పష్టం చేసింది. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేలా ఇందులో నిబంధనలు పొందుపరిచారు.

## రూ.10 కోట్ల వరకు జరిమానా

పేపర్ లీక్ కేసుల్లో దోషులకు గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా బిల్లులో నిబంధనలు రూపొందించారు. గతంలో వ్యక్తిగత నేరాలకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా ఉండేది. వ్యవస్థీకృత నేరాలకు 5 నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉండేది. ఇకపై పేపర్ లీకేజీలను తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకునేలా చట్టాన్ని మరింత బలోపేతం చేశారు.

## 52 ఎఫ్ఐఆర్‌లు నమోదు

బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు.
నీట్ పేపర్ లీక్ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని, జరిగిన అనుభవాల నుంచి నేర్చుకుని పరీక్షా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నామని చెప్పారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు తీసుకొచ్చిన సవరణ బిల్లు ఇందుకు నిదర్శనమన్నారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై జితేంద్ర సింగ్ విమర్శలు చేశారు. పార్లమెంటరీ వ్యవహారాలపై ఆయనకు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో తెలియదని ఆరోపించారు.

## చర్చను అడ్డుకుంటున్నారు : రిజిజు

యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.
విద్యార్థుల సంక్షేమం, పరీక్షా విధానంలో విశ్వసనీయత పెంచేందుకే ఈ బిల్లు తీసుకొచ్చామని తెలిపారు. పరీక్షా విధానంపై సూచనలు ఉంటే ఇవ్వాలని విపక్ష సభ్యులను కోరారు.

# వందేమాతరానికి చట్టబద్ధ రక్షణ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
జాతీయ గేయం వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. వందేమాతరాన్ని అవమానించడం, ఆలాపన సమయంలో ఆటంకం కలిగించడం నేరంగా పరిగణించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణ మనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ఉద్దేశమని కేంద్రం తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు.



## విపక్షాల వాకౌట్

బిల్లుపై చర్చ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పలుమార్లు కోరినా.. ఆందోళనలు కొనసాగాయి. చివరకు కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలే మాట్లాడుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

# విద్యార్థుల నిరసనలపై మాటల యుద్ధం

**పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారు : నడ్డా**



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు లాఠీఛార్జి చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జేపీ నడ్డా తిప్పికొట్టారు. శాంతిభద్రతలను కాపాడేందుకు, ఆందోళనకారులను అదుపు చేసేందుకు పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా తెలిపారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను కూడా పలుమార్లు అరెస్టయ్యానని గుర్తు చేశారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తనను తరగతి గదిలోనే అరెస్టు చేసిందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ప్రతి అంశాన్ని రాజకీయంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. సీపీఎం కార్యాలయంపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను కూడా నడ్డా ఖండించారు. ఈ అంశంపై రాజ్యసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.



# రైతుల ఆశలకు కొత్త భరోసా

- తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీం భారీ ఊరట
- పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లికి చట్టపరమైన రక్షణ
- ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు చెల్లుబాటు.. నిర్మాణ పనులకు అడ్డంకులు లేవు

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలోని ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు తీర్పుతో భారీ ఊరట లభించింది. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. ఇప్పటికే కొనసాగుతున్న పనులు యథావిధిగా కొనసాగించేందుకు ఈ తీర్పు మార్గం సుగమం చేసింది.

## పర్యావరణ అనుమతులకు రక్షణ

కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వు (ఓఎం)ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు మాత్రం చెల్లుబాటులోనే ఉంటాయని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## భవిష్యత్ ప్రాజెక్టులకు కొత్త నిబంధనలు

ఈ తీర్పు భవిష్యత్ ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఇకపై కొత్త ప్రాజెక్టులు చేపట్టాలంటే ముందస్తుగా పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

## ఉత్తర్వులతో చట్టాల మార్పు సాధ్యం కాదు

కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని సూచించింది.

## తెలంగాణకు కీలక ప్రయోజనం

సాగునీటి రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు కీలక ప్రాజెక్టులకు ఈ తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు ఎలాంటి అంతరాయం ఉండదని కోర్టు స్పష్టం చేయడంతో రాష్ట్రానికి ఇది కీలక విజయంగా భావిస్తున్నారు.

## రైతుల ఆశలకు భరోసా

సాగునీటి విస్తరణ, వ్యవసాయ అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులు ముందుకు సాగేందుకు సుప్రీం తీర్పు బలాన్నిచ్చింది. ప్రాజెక్టులు పూర్తయితే ఆయకట్టు విస్తరణతో పాటు రైతులకు సాగునీటి సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దృష్టి

- బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలి : భట్టి విక్రమార్క
- అర్హుల ఓటు హక్కు కాపాడటమే లక్ష్యం



న్యూఢిల్లీ, నేటిధడాత్రి:
ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కాంగ్రెస్ బీఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటమే లక్ష్యమన్నారు.
ఢిల్లీలో జరిగిన తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ-ప్రభుత్వ సమన్వయం, సంస్థాగత బలోపేతంపై చర్చించారు. రాష్ట్రంలో 36 వేల మంది బీఎల్ఏలను నియమించామని, ఇప్పటికే 50-60 శాతం ప్రక్రియ పూర్తయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర్ రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# పులుల సంరక్షణ అందరి బాధ్యత

**జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలి : మంత్రి సురేఖ**



హైదరాబాద్, నేటిధాత్రి:
పులుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు.
అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పులిని కాపాడటం అంటే అడవులు, పర్యావరణం, జీవవైవిధ్యాన్ని రక్షించడమేనన్నారు.
తెలంగాణలో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు కీలకంగా ఉన్నాయని తెలిపారు. కవ్వాల్‌లో పులుల సంఖ్య పెంపునకు టైగర్ రీఇంట్రడక్షన్ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణలో కృషి చేసిన అటవీ సిబ్బందికి ప్రశంసలు అందించారు.

# చెరకు సాగుకు కొత్త ఊపు

- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణపై సర్కార్ దృష్టి
- 50 లక్షల టన్నుల చెరకు అవసరం : సీఎస్



హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రంలో చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమలను పునరుద్ధరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో నడవాలంటే ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరం కాగా.. ప్రస్తుతం 20 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే ఉందన్నారు.
డ్రిప్ సాగు వంటి ఆధునిక పద్ధతులతో దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. 2026-27లో 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు రైతులకు టన్నుకు రూ.500 ప్రోత్సాహకం ఇవ్వాలని రైతు ప్రతినిధులు కోరారు.



# హైడ్రాపై కేటీఆర్ వ్యాఖ్యలకు తుమ్మల కౌంటర్

**బంగాళాఖాతంలో మునిగిపోయినవారే అలాంటి మాటలు అంటారు**

హైదరాబాద్, నేటిధాత్రి:
హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘాటుగా స్పందించారు. "బంగాళాఖాతంలో మునిగిపోయిన వారే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటున్నారు" అంటూ విమర్శించారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు కొనసాగుతోందని, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపడం మంచి పరిణామమన్నారు. గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా ముఖాముఖి కార్యక్రమాల ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# అంబర్‌పేట బోనాలకు భారీ ఏర్పాట్లు

**శాఖల సమన్వయంతో భక్తులకు సౌకర్యాలు**



హైదరాబాద్, నేటిధాత్రి:
అంబర్‌పేట మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అధికారులను ఆదేశించారు. ఆగస్టు 9న జరిగే ఉత్సవాలకు జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాన్స్‌కో, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో బోనాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

# నేరస్తులకు అండగా నిలవడమే జగన్ పని : చంద్రబాబు

- నేర చరిత్ర పార్టీది.. నేతలంతా నేర చరితులే!
- నేరస్థుల పరామర్శలా? సమాజానికి ఏం సందేశం ఇస్తారు?
- జగన్ తీరుపై సీఎం చంద్రబాబు ఫైర్



అమరావతి, నేటిధాత్రి:
వ్యవస్థలను నిర్మించాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రావాలని, కానీ వ్యవస్థలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నారని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
జైలులో ఉన్న వైసీపీ నేతను పరామర్శించడంపై స్పందించిన చంద్రబాబు.. సాక్ష్యాలను తారుమారు చేసి ఇతరుల జీవితాలను బలి చేయాలని చూసిన వారిని పరామర్శించడం ద్వారా ఏం సందేశం ఇస్తారని ప్రశ్నించారు.

## చట్టాలంటే గౌరవం లేని పార్టీ అది

నేర ప్రవృత్తి ఉన్నవారు నేరాలు చేసి వాటిని ఎదుటివారిపై రుద్దాలని చూస్తారని ఆరోపించారు. అలాంటి వారంతా ఆ పార్టీలోనే ఉన్నారని వ్యాఖ్యానించారు.

## సీసీ కెమెరాలే సాక్ష్యాలు బయటపెడుతున్నాయి

2014-19 మధ్య ఏర్పాటు చేసిన వేలాది సీసీ కెమెరాలు నిర్వీర్యం కాగా.. కూటమి ప్రభుత్వం వాటిని పునరుద్ధరించిందని చంద్రబాబు తెలిపారు. దీంతో నేరస్తులను ఆధారాలతో పట్టుకోగలుగుతున్నామని చెప్పారు.

# మనిషి-ఏనుగు ఘర్షణకు చెక్

- గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరం ప్రారంభం
- ప్రజల భద్రత.. వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యం : పవన్ కళ్యాణ్



అమరావతి, నేటిధాత్రి:
మనిషి-ఏనుగు ఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారం చూపే లక్ష్యంతో పార్వతీపురం మన్యం జిల్లా గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రజల ప్రాణాలు, రైతుల పంటల రక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని పవన్ తెలిపారు. అడవుల నుంచి గ్రామాల్లోకి వచ్చే ఏనుగుల సమస్యకు ఆధునిక సాంకేతికతతో పరిష్కారం చూపడమే ఈ శిబిరం లక్ష్యమన్నారు.

## ఏనుగుల దాడులతో నష్టాలను తగ్గించడమే ధ్యేయం

పలమనేరు ప్రాంతంలో కుంకీ ఏనుగుల సహకారంతో చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయని, అదే తరహా ఫలితాలను పార్వతీపురం మన్యం జిల్లాలో సాధిస్తామని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం అందించిన నాలుగు కుంకీ ఏనుగులకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్ది త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

- ఆంజనేయ స్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల ప్రార్థనలు
- యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యేకు సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్ష



నర్సంపేట, నేటిధాత్రి:
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కేసీఆర్ నగర్ ఫేజ్-02 బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లూరు గ్రామంలోని 350 ఏళ్ల పురాతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి పూజలు చేసి ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడాలని ప్రార్థించారు.

## ప్రజా సేవలో ప్రత్యేక గుర్తింపు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజా సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగి ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

## వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగింపు

ఈ నెల 26న పెద్ది సుదర్శన్ రెడ్డికి గుండెపోటు రావడంతో తొలుత వరంగల్‌లో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోందని నాయకులు తెలిపారు.

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

పెద్ది సుదర్శన్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆంజనేయ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీరాధర్ ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, అనసూయ, సుధాకర్, పాండు, అనిల్, అజయ్, మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికుల భద్రతపై నిర్లక్ష్యం ఎందుకు

▸కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యంపై సవతితల్లి ప్రేమ...

▸సీటీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్....



**మందమర్రి, నేటిధాత్రి:** సింగరేణి సంస్థలో కాంట్రాక్టు కార్మికుల శ్రమతో వచ్చే లాభాలపై చూపుతున్న శ్రద్ధ.. వారి ఆరోగ్యం, భద్రతపై ఎందుకు చూపడం లేదని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (సీటీయూ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందించడంలో యాజమాన్యం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సేఫ్టీ వారోత్సవాల పేరుతో హడావుడి చేస్తున్న యాజమాన్యం.. కాంట్రాక్టు కార్మికుల భద్రతకు అవసరమైన పరికరాలు అందించడంలో ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల భద్రత విషయంలో తేడా చూపకూడదని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సివిల్, సివిక్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, రోడ్డు క్లీనింగ్, బెల్ట్ క్లీనింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు వర్షాకాలంలో అనారోగ్య సమస్యలకు గురికాకుండా ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి రైయిన్‌కోట్ అందించే బాధ్యతను సింగరేణి యాజమాన్యం తీసుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులను కాంట్రాక్టు కార్మికులకు అందించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమేనని అన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఒకే కుటుంబం ఒకే గమ్యం ఒకే లక్ష్యం అనే నినాదాలకు పరిమితం కాకుండా కాంట్రాక్టు కార్మికులకు ఆచరణలోనూ సమాన ప్రాధాన్యం కల్పించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్‌లో విభేదాలు..పార్టీకి నష్టమే!

▸బీఆర్ఎస్ నాయకుడు శనిగరపు శ్రీనివాస్...



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతం కావడం పార్టీ శ్రేణుల్లో ఆందోళనకు కారణమవుతోందని దీంతో పార్టీకి నష్టం వాటిల్లే అవకాలు ఉన్నాయని తెలంగాణ ఉద్యమకారుడు,సీనియర్ నాయకుడు శనిగరపు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వర్గం,తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత,ఎమ్మెల్సీ మధుసూదనాచారి వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మధుసూదనాచారి అనుచరులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థికే టికెట్ వస్తుందని, విజయం తమదేనని ప్రకటించగా..అందుకు ప్రతిగా గండ్ర వర్గం సైతం తమ నేతకు టికెట్ ఖాయమంటూ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇరు వర్గాలు బహిరంగంగా పరస్పర వ్యాఖ్యలు చేసుకోవడం వల్ల కార్యకర్తల్లో అయోమయం నెలకొంటోందన్నారు. ఇద్దరు నేతలు పార్టీకి చెందిన వారేనని, ఈ విధంగా బహిరంగ విమర్శలు చేసుకోవడం, కార్యకర్తలను రెండు వర్గాలుగా విడగొట్టడం వల్ల చివరకు పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందని శనిగరపు శ్రీనివాస్ పేర్కొన్నారు.

▸**అధినేత నిర్ణయమే శిరోధార్యం..** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవరికి టికెట్ ఇచ్చినా కార్యకర్తలంతా ఏకతాటిపైకి వచ్చి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి



**జడ్చర్ల, నేటిధాత్రి:** అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాలానగర్ లారీ అసోసియేషన్ యజమానులు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతులతో ఇసుక రవాణా చేస్తున్న తమకు అక్రమ రవాణా వల్ల నష్టం కలుగుతోందని తెలిపారు. రాజాపూర్, నవాబుపేట, బాలానగర్ మండలాల్లోని వాగుల నుంచి రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# ఆగస్టు 10న పటాన్‌చెరులో బోనాల పండుగ



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** ఆషాఢ మాస బోనాల పండుగను పటాన్‌చెరు పట్టణంలో ఆగస్టు 10న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.
పటాన్‌చెరులోని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయంలో నిర్వహించిన పట్టణ ప్రముఖుల సమావేశంలో బోనాల ఏర్పాట్లపై చర్చించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, పురోహితులు పాల్గొన్నారు.

# మానవత్వమే కాంగ్రెస్ ధ్యేయం: నడిగోటి రాము



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** ప్రజా సంక్షేమంతో పాటు మానవత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము అన్నారు. బీఆర్ఎస్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో బాధపడుతున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించి, హనుమకొండ నుంచి హైదరాబాద్ వరకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయించి ప్రాణాలు కాపాడటం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా తీసుకున్న ఈ నిర్ణయం సీఎం మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు వంటి కార్యక్రమాలు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. మండల అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**పరకాల, నేటిధాత్రి:** భారీ వర్షాల నేపథ్యంలో పరకాల, నడికూడ మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరకాల సీఐ క్రాంతికుమార్ సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. చిన్నారులను నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

# ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**చర్ల, నేటిధాత్రి:** చర్ల మండలంలోని ఏకలవ్య పాఠశాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించారు.
ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి డాక్టర్‌గా ఎదిగి ప్రజాసేవ లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని విద్యార్థులకు తెలిపారు. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల అవసరమన్నారు. అనంతరం పాఠశాల భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు ఎస్ఐఆర్ కీలకం



**చిట్యాల, నేటిధాత్రి:** ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎంతో కీలకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల గణపతి అన్నారు. చిట్యాల మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు, వివరాల్లో తప్పుల సవరణపై అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వెంటనే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్ల కింద చెట్ల తొలగింపు



**గుండాల, నేటిధాత్రి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభునిగూడెం గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను గ్రామస్తుల సహకారంతో తొలగించారు. సర్పంచ్ సుమలత, ఆమె భర్త రాజబాబు ఆధ్వర్యంలో శంభునిగూడెం నుంచి వెన్నెలబైలు వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర చెట్లను తొలగించారు. వర్షాలు, గాలుల సమయంలో చెట్లు విద్యుత్ తీగలకు తగలడంతో తరచూ కరెంట్ సరఫరా నిలిచిపోతుండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. రామచంద్రాపురం డివిజన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని అన్నారు. ఎస్ఐఆర్‌లో పాల్గొనని ఓటర్లను గుర్తించి వివరాలు నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రక్రియ ముగియడానికి తక్కువ సమయం మాత్రమే ఉన్నందున బీఎల్ఏలు మరింత చురుగ్గా పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పని వేళల్లోనే వెటర్నరీ ఆసుపత్రికి తాళం



▸సిబ్బంది ఫోన్ నంబర్లు కూడా లేవు..అధికారుల తీరుపై బీజేపీ మండల అధ్యక్షుడు మహేందర్ యాదవ్ ఆగ్రహం...

**మల్లంపల్లి, నేటిధాత్రి:** ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పని వేళల్లోనే మల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రికి తాళం వేసి ఉండటంపై బీజేపీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ.. పశువులకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రి పని వేళల్లోనే మూసి ఉండటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పశువులు అనారోగ్యానికి గురైతే రైతులు, పశుపాలకులు ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి వద్ద విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది పేర్లు, వారి సంప్రదింపు నంబర్లు, అత్యవసర సేవల కోసం ఫోన్ నంబర్లు, పని వేళల వివరాలను కూడా ప్రదర్శించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. కనీస సమాచారం అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు ఘటనపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రుల్లో పని వేళలు, వైద్యులు--సిబ్బంది వివరాలు, అత్యవసర సంప్రదింపు నంబర్లను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మల్లంపల్లి మండల ఉపాధ్యక్షులు కొండ యుగేందర్, బండి బాబు, జనరల్ సెక్రటరీ ఎండిగ రాజు, కార్యదర్శి పోతరాజు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# గురు మహిమపై విద్యార్థులకు బోధన



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** గురు పౌర్ణమి సందర్భంగా మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు నరేష్ విద్యార్థులకు భారతదేశ చరిత్ర, సంస్కృతి, గురువుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, మన సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని వివరించారు. గురువు జ్ఞానాన్ని అందించి జీవితానికి మార్గనిర్దేశం చేస్తారని, గురువుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై పోలీసుల అప్రమత్తత

▸రాళ్లవాగు వద్ద పరిస్థితులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా....



**మంచిర్యాల, నేటిధాత్రి:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ఉన్న రాళ్లవాగు వద్ద పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాళ్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోందని, దీంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు.
ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని,
మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు.
పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని,వర్షాకాలంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ముఖ్యంగా కోటపల్లి,నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైతే ఎస్‌డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలను మోహరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 30 మంది ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ఏడాది వరదల సమయంలో గ్రామాలు నీటిలో చిక్కుకున్నప్పుడు బోట్ల సహాయంతో విజయవంతంగా సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. ఈ పరిశీలనలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



**జైపూర్, నేటిధాత్రి:** భారీ వర్షాల నేపథ్యంలో జైపూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జి. సత్యనారాయణ గౌడ్, ఎంపీఓ శ్రీపతి బాపురావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితులను పరిశీలించిన అధికారులు వాగులు, చెరువులు, గోదావరి పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. రసూల్‌పల్లె, టేకుమట్ల వాగులు ఉద్ధృతంగా ప్రవహించడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, విద్యుత్ తీగలు, చెట్లు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.

# బీరంగూడ గుట్టపై ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**పటాన్‌చెరు, నేటిధాత్రి:** గురుపౌర్ణమి సందర్భంగా బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, గురు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువులకు అత్యున్నత స్థానం ఉందని, గురువును దైవంగా భావించడం మన సంప్రదాయమని అన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రాధాకృష్ణను ఆలయ చైర్మన్, అధికారులు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు రాజా రమేష్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
వర్షాల నేపథ్యంలో అత్యవసర సేవల పరిశీలనలో భాగంగా వార్డుల్లో పర్యటిస్తుండగా రాజా రమేష్ దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న అధికారులను అవమానించేలా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. రాజా రమేష్, రామిడి కుమార్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు కమిషనర్ వెల్లడించారు.

# హైడ్రా చర్యలపై సీఎంకు రవికృష్ణ ప్రశ్నలు

▸తుది తీర్పు రాకముందే ప్రభుత్వ భూమిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్న....

▸ఆక్రమణల తొలగింపులో సమాన న్యాయం పాటించాలని సూచన.....



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** రాష్ట్రంలో హైడ్రా చేపడుతున్న భూ పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు చర్యలపై అడ్వొకేట్ రవికృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సామాజిక మాధ్యమ వేదికలో బహిరంగంగా పలు ప్రశ్నలు సంధించారు. న్యాయస్థాన ఆదేశాల అమలు, ప్రభుత్వ భూముల గుర్తింపు, ఆక్రమణల తొలగింపులో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని ఆయన కోరారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే చట్టం నిర్దేశించిన విధంగా పైస్థాయి న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందేనని రవికృష్ణ పేర్కొన్నారు. అయితే న్యాయస్థాన ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పాటించకుండా వ్యవహరిస్తే అది న్యాయస్థాన ధిక్కారానికి దారితీసే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఇది ప్రభుత్వ న్యాయ సలహా బృందం వైఫల్యమా, లేక న్యాయస్థానాల ఆదేశాల పట్ల నిర్లక్ష్యమా అని ప్రశ్నించారు. ఐలాపూర్ భూముల విషయంలో ఇప్పటివరకు ఆ భూములు ప్రభుత్వానివేనని ఏ న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న తీర్పు ప్రకారం ఆ భూములు వ్యక్తిగతయాజమాన్యంలోని భూములుగా గుర్తించబడ్డాయని, ఆ తీర్పుపై దాఖలైన అప్పీలు ఇంకా పెండింగ్‌లో ఉండగా, యథాతథ స్థితిని కొనసాగించాలని న్యాయస్థానం ఆదేశాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ కంచె ఏర్పాటు చేయడం ఏ అధికారంతో జరిగిందని ప్రశ్నించారు. అలాగే ఐలాపూర్‌లో ఎనిమిది వందల అరవై ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించిందని ప్రభుత్వ ప్రచార విభాగం ప్రకటించడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానం తుది తీర్పు వెలువడకముందే ఆ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించడం ఏ చట్టం ప్రకారం జరిగిందని నిలదీశారు. పటాన్‌చెరువు--అమీన్పూర్ ప్రాంతంలోని ఆక్రమణల అంశాన్ని కూడా రవికృష్ణ ప్రస్తావించారు. అమీన్‌పూర్ సర్వే నంబరు తొమ్మిది వందల తొంభై మూడులో సుమారు వంద ఎకరాలు, సర్వే నంబరు నాలుగు వందల అరవై రెండులో రెండు ఎకరాలు, సర్వే నంబరు వెయ్యిలో సుమారు ఒకటిన్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. కృష్ణారెడ్డిపేట సర్వే నంబరు నూట అరవై నాలుగులో ప్రభావశీలులకు చెందిన అనేక భారీ నిర్మాణాలు ఉన్నప్పటికీ ఒక నిర్మాణంపైనే చర్యలు తీసుకున్నట్లు ప్రచారం చేశారని, మిగిలిన వాటిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. బీరంగూడ శంభునికుంటలో మొత్తం ఇరవై రెండు ఎకరాల పన్నెండు గుంటల భూమిలో సుమారు పద్నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. అదే ప్రాంతంలో చెరువు శికం భూమిని ఆక్రమించి చట్టబద్ధ అనుమతులు లేకుండా ఐదు అంతస్తుల వాణిజ్య భవనం నిర్మించి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై హైడ్రా చేపట్టిన చర్యలు ఏమిటో వెల్లడించాలని కోరారు.
ఈ విషయాలపై హైడ్రా కమిషనర్‌ను ప్రశ్నించగా, ఇతర శాఖల పనితీరు గురించి ఆయా శాఖలను అడగాలని, హైడ్రా తన విధులు నిర్వహిస్తోందని, అమీన్‌పూర్‌లో కూడా అనేక ప్రభుత్వ భూములను పరిరక్షించామని సమాధానం ఇచ్చినట్లు రవికృష్ణ తెలిపారు.
చట్టం ముందు అందరూ సమానమేనని, చిన్నవారికి ఒక విధానం, పెద్దవారికి మరో విధానం ఉండకూడదని రవికృష్ణ అన్నారు.
న్యాయస్థానం తుది తీర్పు వెలువడకముందే భూములను ప్రభుత్వ భూములుగా ప్రకటించడం సరికాదని పేర్కొంటూ,
ఈ అంశాలపై ప్రభుత్వం, హైడ్రా అధికారులు ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఈదులకుంట చెరువును వరద నీటితో నింపాలి: సీపీఎం



**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:** ఖానామెట్‌లోని చారిత్రాత్మక ఈదులకుంట చెరువును వరద నీటితో నింపి భూగర్భ జలాలను పరిరక్షించాలని సీపీఎం శేరిలింగంపల్లి జోన్ కమిటీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. చెరువును ఎండబెట్టి ఆక్రమణలకు యత్నిస్తున్నారని ఆరోపించిన నాయకులు, తమ్మిడికుంట నుంచి వచ్చే వరద నీటిని అక్రమంగా మళ్లించడం వల్ల భూగర్భ జలాలు పడిపోయి పరిసర ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నీటిని ఈదులకుంటలోకి మళ్లించి చెరువును పునరుద్ధరించాలని, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## గుడిబండ పాఠశాలలో ఘనంగా బాలసభ



**కోదాడ, నేటిధాత్రి:** కోదాడ మండలంలోని పాత గుడిబండ ప్రభుత్వ పాఠశాలలో బాలసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని, బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు,

## శ్రీ శ్వేత లక్ష్మి వారాహి ఆలయంలో వైభవంగా శాకాంబరి ఉత్సవాలు

▶▶బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి.....



**భూపాలపల్లి, నేటిధాత్రి:** రేగొండ మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ శ్వేత లక్ష్మి వారాహి ఆలయంలో బుధవారం శాకాంబరి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించగా, అమ్మవారికి శాకాంబరి అలంకరణ, వారాహి హోమం, పూర్ణాహుతి, 54 రకాల నైవేద్యాలతో మహా నివేదన, గురుపూజోత్సవం, ప్రత్యేక హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శ్రీశ్రీశ్రీ శ్వేత లక్ష్మి వారాహి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ శాకాంబరి దేవి అన్నపూర్ణ స్వరూపిణిగా భక్తులపై కరుణా కటాక్షాలు ప్రసాదిస్తుందని అన్నారు. అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, సుభిక్షాలతో జీవించాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించడం ఆనందదాయకమని, అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం కీర్తి రెడ్డి, నిషీధర్ రెడ్డి భక్తులతో కలిసి ప్రత్యేక హారతిలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దాసరి వేణు, సీనియర్ నాయకులు విజేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



**భూపాలపల్లి, నేటిధాత్రి:** వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుల కారణంగా విద్యుత్ ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్ హెచ్చరించారు. తెగిపోయిన విద్యుత్ తీగలు, తడి విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సూచించారు. తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు తాకవద్దని, ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించాలని తెలిపారు. రైతులు విద్యుత్ లైన్ల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ భూముల్లో ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవద్దని సూచించారు. విద్యుత్ లోపాలు లేదా ప్రమాదాలు గమనిస్తే వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## శ్రీరామ హృదయ కలశంతో మెట్టుపల్లి పులకించింది



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** లోక కళ్యాణార్థం, ధర్మ సంస్థాపన లక్ష్యంగా చేపట్టిన శ్రీరామ హృదయ కలశ యాత్ర మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి గ్రామానికి చేరుకుంది.

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి ఆశీస్సులతో వరంగల్, హన్మకొండ జిల్లాల వికాస తరంగిణి అధ్యక్షులు డాక్టర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈ కలశాన్ని మెట్టుపల్లిలోని భక్తాంజనేయ స్వామి దేవాలయానికి అందజేశారు.

కలశ ఆగమనం సందర్భంగా మంగళవారం సాయంత్రం 7 గంటలకు గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. తులసి మాత, లలిత మాత భజన బృందాల ఆధ్వర్యంలో భజనలు, మహిళల కోలాటాలు, రథోత్సవంతో కలశాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం దేవాలయంలో ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ తుమ్మ కృష్ణమూర్తి శ్రీరామ అష్టోత్తరాలతో శ్రీరామ హృదయ కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పెండెం రాజేందర్ మాట్లాడుతూ, మొగుళ్లపల్లి మండలంలోని 15 గ్రామాల్లోని 15 దేవాలయాల్లో రోజుకు ఒక దేవాలయంలో వరుసగా పూజలు నిర్వహిస్తామని చెప్పారు. చివరికి అన్ని కలశాలను మెట్టుపల్లికి తీసుకొచ్చి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి 70వ జన్మదిన వేడుకల్లో భాగంగా ధర్మ సంస్థాపనార్థం శ్రీరామచంద్రమూర్తికి 1008 కలశాలతో మహా అభిషేకం చేస్తామని వివరించారు. రెండవ రోజు పూజలు మోట్లపల్లి అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పుణ్య కార్యంలో మండలంలోని అన్ని గ్రామాల అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## సీబీఎస్ఈ ఖో-ఖోలో ఏకశిలకు ప్రథమ స్థానం




**ఐనవోలు, నేటిధాత్రి:** తెలంగాణ, ఆంధ్ర సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో ఛాంపియన్‌షిప్ బాలికల విభాగంలో ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన ఏకశిల హైస్కూల్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ విజయంతో జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక జట్టుగా నిలిచింది. విజేతలకు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి షీల్డులు అందించి అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తెలిపారు. జట్టు విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమిషనర్‌కు క్షమాపణ చెప్పాలి



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణకు బీఆర్ఎస్ నాయకుడు రాజా రమేష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న కమిషనర్‌తో దురుసుగా ప్రవర్తించి, బెదిరింపులకు పాల్పడడం ఖండనీయమన్నారు. ప్రభుత్వ అధికారులను అవమానించడం సరికాదని, ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజా రమేష్, రామిడి కుమార్ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భూ సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి, నేటిధాత్రి:** రేగొండ మండలంలోని రేపాక రామన్నగూడెం తండా, కొడవటంచ గ్రామాల్లో నిర్వహించిన భూ సర్వే కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే ద్వారా నిజమైన భూ యజమానులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందడంతో పాటు రైతు భరోసా, రైతు బీమా, ధాన్యం కొనుగోలు వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా అందుతాయని తెలిపారు. రైతుల భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## నల్లబండగూడెంలో గురుపౌర్ణమి వేడుకలు



**కోదాడ, నేటిధాత్రి:** గురుపౌర్ణమి సందర్భంగా కోదాడ మండలం నల్లబండగూడెం శ్రీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి హాజరై సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదం వడ్డించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువు పొడిగించాలి



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** రేషన్ కార్డులకు ఈ-కేవైసీ (విద్యుత్ గుర్తింపు) గడువును వెంటనే పొడిగించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నిమ్మల భద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు వసతి గృహాల్లో ఉండడం, ఐదేళ్లలోపు పిల్లలకు బయోమెట్రిక్ నమోదు సాధ్యం కాకపోవడం వల్ల అనేక మంది లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జూలై 31లోపు ప్రక్రియ పూర్తి కాకపోతే అర్హులైన కుటుంబాలు రేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గడువును పొడిగించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కమిషనర్‌ను బదిలీ చేయాలి



▶▶చైర్‌పర్సన్ సంధ్యారాణి

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను బదిలీ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుడిసెల సంధ్యారాణి డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులకు కమిషనర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకుడు రాజా రమేష్ మాట్లాడుతూ పాలకవర్గం ఆమోదించిన పనులను ముందుకు సాగనివ్వడం లేదని ఆరోపించారు. మహిళా చైర్‌పర్సన్‌ను అవమానించేలా కమిషనర్ వ్యవహరిస్తున్నారని అన్నారు. అభివృద్ధికి సహకరించని కమిషనర్‌పై చర్యలు తీసుకుని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శానిటేషన్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ



**పరకాల, నేటిధాత్రి:** వర్షాకాలంలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బంది కోసం పరకాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ పాత మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు మున్సిపాలిటీ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వర్షాల సమయంలో సిబ్బంది ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి గంజి వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి ఎమ్మెల్యే గండ్ర



**శాయంపేట, నేటిధాత్రి:** అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గట్లకానిపర్తి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్ఎస్‌కు చెందిన ఉపసర్పంచ్ ఒంటెల లావణ్య-కరుణాకర్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భారత ప్రభుత్వ "నషాముక్త్ యువ--వికసిత్ భారత్" కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ సీఐ డి. నరేష్ కుమార్ మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. యువత లక్ష్యసాధనపై దృష్టి పెట్టి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి రఘు, కళాశాల ప్రిన్సిపాల్ రమణరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



**భూపాలపల్లి, నేటిధాత్రి:** వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సందర్శించి సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, కేసులను వేగంగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. రౌడీ షీటర్లపై నిఘా కొనసాగించాలని, ప్రజలకు స్నేహపూర్వక సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలి



**తంగళ్లపల్లి, నేటిధాత్రి:** తంగళ్లపల్లి మండలం చిన్నబోనాల సబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఏం.జె. అల్రెడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కేంద్ర నిర్వహణ, వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్ చైన్ విధానం, లబ్ధిదారుల నమోదు, మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణీ, శిశువు, చిన్నారికి జాతీయ టీకా షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీకాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, టీకాలు తీసుకోని వారిని గుర్తించి వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సంతోష్ కుమార్, వీసీసీఎం నవీన్, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నడిగూడెం సాయిమందిరంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**నడిగూడెం, నేటిధాత్రి:** గురు పౌర్ణమి పురస్కరించుకొని నడిగూడెం సాయిబాబా మందిరంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబావారికి పంచామృత ఫలరసాలతో అభిషేకం ప్రత్యేక పుష్పాలంకరణ గురువులకు సత్కారం మధ్యాహ్న హారతి అన్నదానం సాయంత్రం పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యారంగంలో విశిష్ట కృషిచేసిన గురువులైన బాజా ఉపేందర్ రావ్, వి ఎల్ ఎన్ చారి ,రఘు శ్రీదేవి, వెంకటేశ్వర్లను ఘనంగా సత్కరించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ఆదినారాయణ చేసిన సత్సంగం భక్తులను ఆకట్టుకుంది .కార్యక్రమంలో సాయి సేవా సమితి నిర్వాహకులు రేపాల పురుషోత్తం, ఎం వి రమణ రావు, మహేష్ ,అప్పారావు బాలాజీ నాయక్, దయాకర్ దివ్య లా శ్రీనివాసరావు, భువనగిరి ఉపేందర్, సూర్య ప్రకాష్ రావు, మందిర పూజారి రాజశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## తమ్మర సాయిమందిరంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**కోదాడ, నేటిధాత్రి:** పవిత్ర గురుపౌర్ణమి సందర్భంగా కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర శ్రీ సాయిమందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయినాథుని దర్శనం కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో విశేష పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత: కలెక్టర్



**సూర్యాపేట, నేటిధాత్రి:** ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినప్పుడే విద్యా వ్యవస్థ లక్ష్యం నెరవేరుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ ప్రత్యేక అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత బోధనా విధానాలకు పరిమితం కాకుండా కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, చర్చల ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంచాలని సూచించారు. పాఠశాలల్లోని ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో సూర్యాపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంపై విద్యాశాఖ బృందాన్ని అభినందించారు. ప్రతి విద్యార్థి అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, అధికారులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

FOLLOW US neti_dhatri | WATCH US Netidhatri TV | FOLLOW US netidhatri | FOLLOW US Netidhatri News | 30-07-2026 | నేటిధాత్రి

# అకాల మరణం చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.1 లక్ష సంక్షేమ చెక్కు

▶▶ఉపాధ్యాయ శ్రేయస్సే పీఆర్టీయూ లక్ష్యం -- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి...




**రాయపర్తి, నేటిధాత్రి:** ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ (పీఆర్టీయూ-టీఎస్) ప్రధాన లక్ష్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. పీఆర్టీయూ-టీఎస్ రాయపర్తి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్షేమ నిధి చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఎల్పీ (హిందీ) ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఎం. రాము కుటుంబ సభ్యులకు పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.1 లక్ష ఆర్థిక సహాయ చెక్కును శ్రీపాల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పీఆర్టీయూ సంఘం కేవలం ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యల పరిష్కారానికే కాకుండా, సభ్యులు ఆపదలో ఉన్నప్పుడు వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని చెప్పారు. సభ్యుడు అకాల మరణానికి గురైతే సంఘం తరఫున రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు దునూరి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి, వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘు, రాయపర్తి మండల అధ్యక్షుడు ఆవుల రవీందర్, ప్రధాన కార్యదర్శి గాదె ప్రవీణ్ రెడ్డి, వరంగల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫ్ఫార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్. ప్రసాద్ రావు, ఆర్. వినోద్ రెడ్డి, కర్ర యాకుబ్ రెడ్డి, పి. శ్రవణ్, బండి ఉప్పలయ్య, సంగెం మండల అధ్యక్షుడు జి. విజయ్, గీసుగొండ మండల ప్రధాన కార్యదర్శి మార్త శ్రీనివాస్, మండల కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి

▶▶వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి.

▶▶కలెక్టర్ కుమార్ దీపక్....



**మంచిర్యాల, నేటిధాత్రి:** చెన్నూరులో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రాణహిత నది వరద పరిస్థితులను పరిశీలించిన ఆయన.. నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శిథిల భవనాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బీసీ సంక్షేమ వసతి గృహం, పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని, వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. మండలంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

▶▶ప్రజలకు కలెక్టర్ రాహుల్ శర్మ సూచన...



భూపాలపల్లి, నేటిధాత్రి: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల కోసం కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయం కోసం 9030632608 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

# వరంగల్ తూర్పు తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జిగా వెలిగేటి రవికుమార్

▶▶అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిలను ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ...






**వరంగల్, నేటిధాత్రి:** తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ప్రకటించింది. ఇందులో భాగంగా వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పద్మశాలి కమ్యూనిటీకి చెందిన వెలిగేటి రవికుమార్‌ను నియమించింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. పార్టీని ప్రజల్లో మరింత బలోపేతం చేసి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. తనకు వరంగల్ తూర్పు అసెంబ్లీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

▶▶రైతులతో ముఖాముఖి నిర్వహించనున్న ఎమ్మెల్యే గండ్ర...




**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించేందుకు మొగుళ్లపల్లి మండలంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సునీత తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై 30న మండలంలోని ఆరు గ్రామాల్లో నిర్వహించే సభలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఆర్డీవో, సర్వే, రెవెన్యూ అధికారులు హాజరై రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. రంగాపూర్ రైతు వేదికలో రంగాపూర్, అంకుశపురం గ్రామాల రైతులతో మధ్యాహ్నం 1 గంటకు, ముల్కలపల్లి రైతు వేదికలో మధ్యాహ్నం 3 గంటలకు ముల్కలపల్లి రైతులతో, వేములపల్లి రైతు వేదికలో వేములపల్లి, గుండ్లకర్తి, గుడిపహాడ్ గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించనున్నారు. భూ రీసర్వే విధానం, రైతులకు కలిగే ప్రయోజనాలు, పాటించాల్సిన విధివిధానాలపై అధికారులు వివరించనున్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ కోరారు.

# ఢిల్లీ వసంత్‌కు జాతీయ 'వాగ్దేవి' పురస్కారం



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్‌కు చెందిన సామాజికవేత్త, జాతీయ రైతు ఉద్యమ నాయకుడు ఢిల్లీ వసంత్‌కు న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక 'వాగ్దేవి పురస్కారం' లభించింది. రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత రంగాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమాలు, గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక చైతన్య కార్యక్రమాలను పురస్కార కమిటీ గుర్తించింది. పురస్కారాన్ని రైతులు, యువత, సహచరులకు అంకితం చేస్తున్నట్లు ఢిల్లీ వసంత్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, రైతు సంఘాల నాయకులు పాల్గొని ఆయనను అభినందించారు.

# ప్రభుత్వ గడువు ముగిసేలోపు, ఓటును నమోదు చేసుకోవడం ప్రతి ఓటరు బాధ్యత

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ....





**హనుమకొండ, నేటిధాత్రి:** పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ఓటును నమోదు చేసుకోవడం ప్రతి ఓటరు బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. పశ్చిమ వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, 60 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రామకృష్ణ 60 వ డివిజన్‌లోని పలు బూత్‌లను సందర్శించి, ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బూత్ లెవల్ ఏజెంట్లకు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, డూప్లికేట్ నమోదుల ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ నాగరాజు గారు, డివిజన్ అధ్యక్షులు పున్నం గారు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తక్కువ వర్షపాతంతో ఆరుతడి పంటలే మేలు



**కేసముద్రం, నేటిధాత్రి:** ఎల్‌నినో ప్రభావంతో ఈ వానకాలం సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న సూచించారు. కేసముద్రం రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, ఐకెపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పంట మార్పిడి విధానాన్ని పాటించాలని రైతులకు సూచించారు. తక్కువ నీటితో పండే పెసర, కందులు, కూరగాయల విత్తనాలను రాయితీపై రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి శాంతిప్రియ, ఐకెపీ ఏపీఎం కృష్ణమూర్తి, వ్యవసాయ విస్తరణ అధికారి రాజీవ్ లోచన్, ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# భూభారతి భూ సర్వేపై రైతులకు అవగాహన



**తంగళ్లపల్లి, నేటిధాత్రి:** తంగళ్లపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలో భూభారతి భూ సర్వే (రీ సర్వే)పై రైతులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. భూ సర్వే ప్రక్రియ, భూముల కొలతలు, రికార్డుల పరిశీలన, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ సర్వే ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు వరి పంటతో పాటు తక్కువ నీటితో సాగు చేసే ఇతర పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ వెంకటాచారి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఏడీపీ శ్రీనివాస్, ఆర్ఐ సాయి కృష్ణ, సర్వేయర్ చంద్రమోహన్, గ్రామ సర్పంచ్ గంధం శ్రీనివాస్, ఉప సర్పంచ్ పొన్నాల నర్సింలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# మేదపల్లి రోడ్డుపై రాకపోకలకు అంతరాయం.. జేసీబీతో తక్షణ చర్యలు



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వర్షాలతో బురద, నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఓ ట్రాక్టర్ రోడ్డు పక్కకు దిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న మాజీ మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ సీనియర్ నాయకుడు విజేందర్ రెడ్డి వెంటనే స్పందించి జేసీబీని రప్పించి రోడ్డుపై పేరుకుపోయిన బురదను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. వర్షాకాలంలో ఈ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# రూ.62 లక్షలతో కల్వర్ట్ నిర్మాణం



▶▶పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్...

**కుత్బుల్లాపూర్, నేటిధాత్రి:** ప్రధాన రహదారులు, వారధుల అభివృద్ధి నియోజకవర్గ ప్రగతికి పునాదులని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పైప్‌లైన్ రోడ్డులో రూ.62 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న నూతన కల్వర్ట్ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. గతంలో నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించామని, భవిష్యత్‌లో రహదారుల విస్తరణ, మెరుగుదలకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, మాజీ కార్పొరేటర్ జగన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండండి

▶▶విద్యుత్ భద్రతా నియమాలు పాటించండి.. ప్రాణాలను కాపాడుకోండి: ఎస్ఈ వేణుమాధవ్...



**సిరిసిల్ల, నేటిధాత్రి:** వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని టీజీఎన్‌పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్ తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారుతుందని, ప్రజలు తప్పనిసరిగా విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. తడిసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన తీగలు, తడి చేతులతో స్విచ్‌లు, విద్యుత్ పరికరాలను తాకరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, వైర్లు, ఎర్తింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. విద్యుత్ లైన్ల సమీపంలో ఇనుప వస్తువులతో పనులు చేయవద్దని, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. పిల్లలను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆడనివ్వకుండా చూడాలని, విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని నేరుగా తాకకుండా విద్యుత్ సరఫరా నిలిపివేసి సహాయం అందించాలని సూచించారు. విద్యుత్ లోపాలు, ప్రమాదాలు గమనించిన వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ఎస్ఈ వేణుమాధవ్ విజ్ఞప్తి చేశారు.

# చిట్యాల ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**చిట్యాల, నేటిధాత్రి:** గురు పౌర్ణమి సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చిట్యాల మండలం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా విధులు నిర్వహిస్తున్న సూదం సాంబమూర్తికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. జిల్లాలోని 12 మండలాల నుంచి విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఒక్కో ఉత్తమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి ఈ అవార్డులను అందజేశారు. చిట్యాల మండలం నుంచి సాంబమూర్తి ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధార్మిక సంస్థ అధ్యక్షులు కర్ర జయపాల్ రెడ్డి అవార్డును అందజేసి సాంబమూర్తిని ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీత సాంబమూర్తి మాట్లాడుతూ.. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం అంకితభావంతో మరింత మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. సాంబమూర్తికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల రేగురి సుభాకర్ రెడ్డి, కుసునపు కిరణ్ కుమార్, కామిడి సతీష్ రెడ్డి, బండి శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు. విద్యారంగంలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రమోషన్లు పొందిన పోలీసులు ప్రజలకు సేవలు అందించాలి



**వనపర్తి, నేటిధాత్రి:** పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు పొందిన సిబ్బంది ప్రజలకు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలు అందించాలని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి సూచించారు. వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రాజగౌడ్, నాగేశ్వరరావు, పానుగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన లక్ష్మీనర్సమ్మ, రాంగోపాల్ వర్మ, పెబ్బేరు పోలీస్ స్టేషన్‌కు చెందిన నాగరాజు పదోన్నతులు పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి హెడ్ కానిస్టేబుల్ హోదా బ్యాడ్జీలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల రక్షణకు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

# దైవ స్వరూపమే గురువు



వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు...

**జహీరాబాద్, నేటిధాత్రి:** అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే దైవ స్వరూపమే గురువు అని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ డా. సిద్ధేశ్వరానంద గిరి మహారాజ్ తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, వేద విద్యార్థులచే తల్లిదండ్రుల పాదపూజ, గురు చరిత్ర పారాయణం, రుద్ర సహిత దత్త యజ్ఞం, రథోత్సవం, తులాభారం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు గురుపాద పూజల్లో పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీత హనుమంతరావు పాటిల్ తదితరులు హాజరై గురువులను సన్మానించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్



**మహబూబాబాద్, నేటిధాత్రి:** జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష ఆగస్టు 2న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్, మహర్షి స్కూల్ (కేసముద్రం రోడ్) పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. రవాణా అవసరమైన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాలి

టిఆర్ఎస్ఎంఎ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, మహబూబాబాద్ విద్యార్థులు.




**మహబూబాబాద్, నేటిధాత్రి:** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (టి ఆర్ ఎస్ఎంఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇన్స్పైరింగ్ శేషన్ ఫర్ స్టూడెంట్స్" కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మహబూబాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డా. పి. శభరీష్, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యుక్తవయస్సులో మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి, విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలను జీవితంలో ఆచరించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలిచి మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్ డైరెక్టర్ డా. జె. ప్రమోద్ రెడ్డి, మరియు మహేంద్ర రెడ్డి విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా ఎస్పీ డా. పి. శభరీష్ ని శాలువాతో సత్కరించి, యువతలో చైతన్యం కల్పించేందుకు ఆయన చేస్తున్న సేవలను అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసం, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించడంలో ఎల్లప్పుడూ ముందుండే ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మహబూబాబాద్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుందని. ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయడం ద్వారా సమాజానికి బాధ్యతగల భావి పౌరులను తీర్చిదిద్దాలనే తన లక్ష్యాన్ని పాఠశాల కొనసాగిస్తోంది.

# ఈ పండు ఎప్పుడైనా తిన్నారా..

# ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?

సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉ ంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



### రోగ నిరోధక శక్తి వృద్ధి

పంపర పనసలో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

# వేళకు తింటేనే భళా!



ఆహారంలో పోషకాలు ఉండటం చాలా అవసరం. తేలికపాటి అల్పాహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. మధ్యాహ్న భోజనం పప్పు, కూరలతో నిండుగా ఉండాలి. ఓ మోస్తరుగా రాత్రి డిన్నర్ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ మాకు తెలుసులే అంటారా! మంచిదే!! కానీ, ఈ పోషకాలు ఏ సమయంలోగా తీసుకోవాలో తెలిసినప్పుడే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోండి.

### టైమ్‌కు టిఫిన్

రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

### లంచ్ బెల్

అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉ ంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా%ౌ% శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

### డిన్నర్ విన్నర్

రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే%ౌ% రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

# ఐదు విటమిన్లు తప్పనిసరి!

ఏ ఇంట్లో అయినా ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా బాగుంటుంది. ఉద్యోగం చేసి సంపాదించే మహిళలు అయినా, ఇంటి పట్టున ఉంటూ కుటుంబ యోగక్షేమాలు చూసుకునే గృహిణులకు అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే, ఒక వయసు వచ్చేసరికి అందరిలోనూ అనారోగ్య సమస్యలు తలెత్తడం సహజం. హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి తదితర సమస్యలు వారిని అనారోగ్యానికి చేరువ చేస్తుంటాయి. అయితే, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉ ండగలం. నడి వయసుకు వచ్చాక మహిళలు అనారోగ్యంతో సావాసం చేయొద్దంటే ఈ ఐదు విటమిన్లు రోజువారీగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.



విటమిన్ డి3

దీని లోపం వల్ల ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, ఇన్సులిన్ తగ్గడం, రుతుచక్రంలో మార్పులు, సమస్యలు వస్తాయి. ఉదయాన్నే సూర్యరశ్మి శరీరానికి తాకితే విటమిన్ డి3 పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు, సాల్మన్ చేపలు, గుడ్లు, పాలు, పాల ఉ త్పత్తులకు రెగ్యులర్ డైట్‌లో చోటివ్వడం వల్ల కూడా విటమిన్ డి3 శరీరానికి అందుతుంది.

### విటమిన్ సి

విటమిన్ సి లోపంతో బాధపడేవారికి ప్రొజెస్టిరాన్ ఉత్పత్తి సరిగ్గా ఉండదు. సంతానోత్పత్తి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మకాయ, నారింజ, ఆరెంజ్ వంటి పుల్లటి పండ్ల నుంచి విటమిన్ సి లభిస్తుందని అందరికీ తెలిసిందే. వాటితోపాటు బ్రకోలి, టమాట, క్యాప్సికమ్ నుంచి కూడా శరీరానికి విటమిన్ సి అందుతుంది. జామకాయలు తరచూ తినడం మంచిది. ఇది చర్మ సంరక్షణకూ సహకరిస్తుంది.

### విటమిన్ బి12

ప్రస్తుతం ఎక్కువమంది విటమిన్ బి12 లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది లోపిస్తే.. ఎర్ర రక్త కణాల ఉత్పత్తి మందగిస్తుంది. థైరాయిడ్ సమస్యలు వస్తాయి. మాంసం, చేపలు, గుడ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బి12 లోపం నుంచి బయటపడవచ్చు.

### విటమిన్ బి9

విటమిన్ బి9 లోపంతో గర్భధారణ, సంతానోత్పత్తిలో సమస్యలు ఎదురవుతాయి. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే విటమిన్ బి9 పుష్కలంగా అందుతుంది.

### విటమిన్ బి6

విటమిన్ బి6 లోపం ఉన్న మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సింట్రోమ్, ప్రీ మెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిజార్డర్, అడ్రినల్ గ్రంథి సమస్యలు కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. అరటిపండ్లు, ఆలుగడ్డలు, చికెన్ తినడం వల్ల విటమిన్ బి6 లభిస్తుంది.



# సత్తువ పిండి

మన పెద్దలకు సత్తుపిండి ప్రయోజనాలు బాగా తెలుసు. అందుకే వాళ్లు తరచుగా సత్తుపిండిని ఆహారంగా తీసుకునేవాళ్లు. ఇప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణుల ఆహారంలో సత్తుపిండి ఓ భాగమే. పేదవాళ్ల ప్రొటీన్ల భాండాగారంగా భావించే సత్తుపిండి ప్రయోజనాలను ఇప్పటితరం అంతగా పట్టించుకోవడం లేదు. వీర శివాజీ మెచ్చిన ఈ సహజమైన ప్రొటీన్ పొడి అచ్చంగా భారతీయ ఆహారమే.



### సత్వర శక్తి

సత్తుపిండి శరీరానికి వెంటనే శక్తిని ప్రసాదిస్తుంది. 100 గ్రాముల సత్తుపిండిలో ప్రొటీన్లు 25 నుంచి 30 గ్రాముల వరకు ఉంటాయి. అలా శాకాహారులకు నాణ్యమైన ప్రొటీన్లను ప్రసాదిస్తుంది. అంతేకాదు ఇందులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇది మన కడుపును శుద్ధిచేస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకంతో బాధపడుతున్న వారికి సత్తుపిండి మంచి ఆహారపదార్థం.

### అందరి ఆహారం

సత్తుపిండిలో ట్లగ్లెసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా పెరుగుతాయి. అలా ఇది డయాబెటిస్ ఉన్నవాళ్లకూ మంచిదే. సోడియం తక్కువ ఉండటంతో అధిక రక్తపోటు ఉన్నవారు కూడా ఆరగించవచ్చు. క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఎ, సి విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి. 25 గ్రాముల సత్తుపిండిలో 100 క్యాలరీలు ఉన్నప్పటికీ, దీని ప్రయోజనాలతో పోలిస్తే క్యాలరీల సమస్య పెద్దది కాదు. కండరాలకు శక్తినిస్తుంది కాబట్టి, పెరిగే పిల్లలకూ సత్తుపిండి గొప్పదే.

### ఆహారంలో

బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో సత్తుపిండితో లిట్టి అనే వంటకం చేస్తారు. కూరగాయలు జోడించి పరాఠాలు, ఉప్మా చేసుకోవచ్చు. సత్తుపిండికి ఉల్లిపాయలు కలిపి పకోడీలుగా వేసుకోవచ్చు. సత్తుతో లడ్డూలు, మామిడిపండు రసంతో స్మూతీ, సత్తు కబాబ్‌లు కూడా చేస్తారు. ఇక సత్తుపిండికి కొబ్బరి తురుము, డ్రై ఫ్రూట్స్, శనగపిండి, నెయ్యి, చక్కెర, యాలకుల పొడి లాంటివి చేర్చి చేసే సత్తు పంజిరి రుచిగా ఉంటుంది. నీళ్లు కలిపిన సత్తుపిండి ముద్దకు చక్కెర లేదంటే ఊరగాయ కలుపుకొని ఉపాహారంగానూ ఆరగించవచ్చు. మళ్లీ మధ్యాహ్నం వరకు కడుపులో ఎలుకలు ఉరుకులాడవు.

పానీయంగా

శనగలను ఇసుకలో వేయించి, ఆ తర్వాత వాటిని జల్లెడపడతారు. వీటిని పిండిగా మారుస్తారు. సత్తుపిండి అంటే ఇదే. సత్తుపిండిని బెల్లంతో కలుపుకొని గానీ, ఉ ప్పు, వేయించిన జీలకర్ర పొడితో కలుపుకొని గానీ తాగితే ఆరోగ్యానికి మంచిది. సత్తు షర్బత్ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా జోడించుకోవచ్చు. ఇది శక్తిదాయిని.

### మితం తప్పొద్దు

మంచిదని చెప్పి సత్తుపిండిని ఎక్కువగా తింటే కడుపులో గ్యాస్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవాళ్లు మితంగా తినాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవాళ్లు సత్తుపిండి తినకూడదు. కిడ్నీల్లో రాళ్లు ఉంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ఇక శనగలంటే అలర్జీ ఉన్నవాళ్లు, సత్తుపిండి అరిగించుకోలేని వాళ్లు కూడా సత్తుకు దూరంగా ఉంటే మంచిది.

# గోధుమ పిండికి ఇవి కలిపితే

# టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉ ంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.

మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, క్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి

వాముజి,అవిసె గింజలు

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా

హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.

ఓ పాఠకురాలు



కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉ ండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.

అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉ పయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

# హైడ్రాకు కొత్త కోరలు..!

## కొత్త హైడ్రా చట్టాన్ని అమల్లోకి తేనున్న ప్రభుత్వం

## ఈ చట్టంతో హైడ్రా అధికారులకు మరింత పదును






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

హైదరాబాద్, నేటిధాత్రి:

తెలంగాణలో చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ మరియు ప్రభుత్వ భూములను ఆక్రమణల నుండి విముక్తి చేయడంలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అత్యంత కీలకమైన మరియు సంచలనాత్మకమైన పాత్ర పోషిస్తున్నదనడంలో ఎంతమా త్రం సందేహం లేదు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ సారథ్యంలో ఈ సంస్థ చేపట్టిన చర్యలు హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లా ల్లో పెద్ద మార్పులు తెచ్చాయి. హైడ్రా సాధించిన విజయాలు సామాన్యమైనవి కావు. ఇప్పటివరకు దాదాపు 1,810 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములకు అక్రమ ఆక్రమణల నుండి విముక్తి కలిగించింది. రికవరీ చేసిన ఈ భూముల మరియు ప్రభుత్వ ఆస్తుల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ. 1.20 లక్షల కోట్ల పైమాటే అని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఎటువంటి రాజకీయ లేదా సామాజిక ఒత్తిళ్లకు లొంగకుండా, పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు మరియు సెలబ్రిటీలకు (ఉదాహరణకు నటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్ వంటివి) చెందిన అక్రమ నిర్మాణాలను సైతం హైడ్రా నిర్మొహమాటంగా కూల్చివేసింది. గాజుల రామారంలో 317 ఎకరాలు, ఈలాపూర్‌లో 861 ఎకరాల ప్రభుత్వ భూములను భూమాఫి యా పిడికిలి నుండి విముక్తి చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) మరియు బఫర్ జోన్లలో నిర్మించిన దాదాపు 454 ఎకరాల ఆక్రమణలను హైడ్రా తొలగించింది. గండిపేట (ఉస్మాన్ సాగర్), హిమాయత్ సాగర్, దుర్గం చెరువు, మల్లికార్జున నగర్ చెరువు, అమీన్‌పూర్ చెరువు, బాషామియా కుంట వంటి వందలాది జలాశయాల్లో వెలిసిన ఫార్మ్‌హౌస్‌లు, కమర్షియల్ షెడ్లను నేలమట్టం చేసింది. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ సర్వేలు, మరియుగూగుల్ ఎర్త్ మ్యాప్స్ సాయంతో చెరువుల అసలు సరిహద్దులను (ఎఫ్‌టీఎల్) గుర్తించి పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ నగరానికి ప్రధాన శాపంగా మారిన అర్బన్ ఫ్లడింగ్ (నగర వరదలు) సమస్యను అరికట్టడానికి నాలాల ఆక్రమణలపై హైడ్రా ఉ క్కుపాదం మోపింది. దాదాపు 25 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న నాలాల ఆక్రమణలను మరియు వాటిపై కట్టిన అక్రమ స్లాబులను, షాపులను తొలగించారు. సికింద్రాబాద్ పరిధిలోని ప్యాట్నీ నాలా వెడల్పును ఆక్రమణల వల్ల 70 అడుగుల నుండి 15 అడుగులకు తగ్గించగా, హైడ్రా బుల్డోజర్లతో వాటిని కూల్చివేసి నాలా పూర్వ రూపాన్ని తెచ్చింది. అలాగే ఖైరతాబాద్‌లోని బల్కాపూర్ నాలా ఆక్రమణలను కూడా తొలగించారు. అఘాపుర నాలా వంటి ప్రధాన కాలువల నుండి దాదాపు 56 ట్ర క్కుల వ్యర్థాలను మరియు పూడికను తొలగించి నీటి ప్రవాహాన్ని సుగమం చేశారు. కాలనీల్లో, లేఅవుట్లలో పార్కుల కోసం కేటాయించి ఆక్రమణకు గురైన 90 ఎకరాల ఓపెన్ స్పేస్‌ను విముక్తి చేసి తిరిగి ప్రజలకు అప్పగించారు. ప్రజా రవాణాకు ఆటంకంగా మారిన దాదాపు 62 ఎకరాల రోడ్లు మరియు ఫుట్‌పాత్ ఆక్రమణలను కూడా క్లియర్ చేశారు. మొత్తంగా చెప్పాలంటే, ప ర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మరియు భవిష్యత్ తరాలకు హైదరాబాద్‌ను వరదలు లేని సురక్షిత నగరంగా మార్చడంలో హైడ్రా ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చింది. ఈ విజయాల నేపథ్యంలో, ఈ వ్యవస్థను రాష్ట్రంలోని మిగిలిన 33 జిల్లాలకు కూడా విస్తరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.

### న్యాయపరమైన సవాళ్లు

తెలంగాణలో చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా ఒకవైపు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ వార్తల్లో నిలిస్తే, మరోవైపు చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత ప్రక్రియలు పాటించలేదనే ఆరోపణలతో తీవ్రమైన న్యాయపరమైన సవాళ్లను మరియు కోర్టుల ఆగ్రహాన్ని ఎదుర్కొంటోంది. లోతుకుంట భూముల వివాదంలో కోర్టు ఉ త్తర్వులను పదేపదే ధిక్కరించి నందుకు గానూ, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను వెంటనే ఆ పదవి నుండి తప్పించాలని తెలంగాణ హైకోర్టు (జస్టిస్ అనిల్ కుమార్ జుకంటి ధర్మాసనం) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించడం తాజా పరిణామం. ఆయన స్థానంలో మరొక అర్హత గల ఐజీ/సెక్రటరీ స్థాయి అధికారిని నియమించాలని స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్‌పై కేవలం ఏడాదిన్నర కాలంలోనే దాదాపు 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడంపై హైకోర్టు తీవ్ర దిగ్భ్రాంతి మరియు అసంతఅప్తి వ్యక్తం చేసింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట సర్వే నంబర్ 1, 2 లో ఉన్న 40 ఎకరాల ప్రైవేట్ భూమికి (శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కేసు) సంబంధించి కోర్టు స్టే ఆర్డర్లు ఉన్నప్పటికీ హైడ్రా సిబ్బంది అక్కడికి వెళ్లడాన్ని న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఒకే పిటిషన్‌పై మూడుసార్లు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా చట్టబద్ధమైన పరిధులను దాటి, "తనకు తానే ఒక చట్టంలా " వ్యవహరిస్తోందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్ (జీహెచ్ ఎంసీ), ఇరిగేషన్ వంటి చట్టబద్ధమైన విభాగాలుఉండగా, వాటి అధికారాలను హైడ్రా అధిగమించడాన్ని కోర్టు ప్రశ్నించింది. అనేక కేసులలో (ఉదాహరణకు అమీన్‌పూర్‌లోని పంచవటి డెవలపర్స్ కేసు) బాధితులకు తగిన సమయం ఇవ్వకుండా, కనీస చట్టపరమైన నోటీసులు లేదా వివరణ కోరకుండానే హైడ్రా బుల్డోజర్లతో కూల్చివేతలు మరియు ఫెన్సింగ్ పనులు చేపట్టిందని కోర్టుకు ఫిర్యాదులు అందాయి. సరైన మార్గదర్శకాలు, చట్టపరమైన నిబంధనలు సమర్పించే వరకు ప్రైవేట్ మరియు నివాస నిర్మాణాల కూల్చివేతలను తాత్కాలికంగా నిలిపివేయాలని గతంలోనే కోర్టు ఆదేశించింది. అయితే, ప్రభుత్వ రోడ్లు, నాలాలు మరియు నీటి వనరుల (చెరువుల ఎఫ్‌టీఎల్) తక్షణ రక్షణ చర్యల విషయంలో హైడ్రాకు కోర్టు కొంతవరకు అనుమతి ఇచ్చింది. అయితే అది కూడా ప్రైవేట్ పట్టా భూముల్లోకి చొరబడకుండా ఉండాలనే షరతు విధించింది.

### రేవంత్ స్పందన

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ తీర్పుపై స్పందిస్తూ, అధికారుల బదిలీలు/పోస్టింగులు అనేవి పూర్తిగా ప్రభుత్వ విశేషాధికారమని, భూమాఫియా కోర్టులను తప్పుదోవ పట్టించిందని పేర్కొం టూ హైకోర్టు ఆదేశాలపై చట్టపరంగా పైకోర్టులో అప్పీలు చేయనున్నట్లు ప్రకటించారు. కమిషనర్ రంగనాథ్ తనపై వచ్చిన కోర్టు ధిక్కరణ కేసులను తిప్పికొడుతూ, వేల కోట్ల విలువైన ప్ర భుత్వ ఆస్తులు, చెరువులను కాపాడుతున్నందుకే పెద్ద పెద్ద భూఆక్రమణదారులు కుట్రపూరితం గా ఈ కేసులు వేశారని, కోర్టులపై తనకు పూర్తి గౌరవం ఉందని అఫిడవిట్ ద్వారా తెలిపారు. మొత్తం మీద, ప్రభుత్వ భూముల పరిరక్షణ అనే లక్ష్యం మంచిదే అయినప్పటికీ, "రాజ్యాంగ ని బంధనలు, చట్ట నియమాలు మరియు పౌరుల హక్కులను ఉల్లంఘిస్తూ ఏ ప్రభుత్వ సంస్థ కూడా చట్టానికి అతీతంగా వ్యవహరించకూడదు" అని తెలంగాణ హైకోర్టు తన తీర్పుల ద్వారా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

### రంగనాథ్ వాదన సమర్థనీయమే అయినా...

హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ వాదన ప్రకారం భూఆక్రమణదారులు కుట్రపూరితంగానే కోర్టు ధిక్కరణ కేసులు వేశారనేది నిజమే అయినప్పటికీ, కొన్ని నిర్దిష్ట సందర్భాలలో హైడ్రా కో ర్టు ఆదేశాలను ఉ ల్లంఘించడానికి దారితీసిన పరిస్థితులు మరియు న్యాయపరమైన లోపాలను చట్టపరమైన విశ్లేషణలు మరియు కోర్టు విచారణల ఆధారంగా క్రింది విధంగా అర్థం చేసుకోవచ్చు. అనేక కేసులలో (ఉదాహరణకు లోతుకుంట ల్యాండ్ కేసు), బాధితులు ఆ భూమి తమకు వారసత్వంగా లేదా కొనుగోలు ద్వారా వచ్చిన 'ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పట్టా భూమి' అని కోర్టుకు పత్రాలు సమర్పించారు. అయితే రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల పాత రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమి లేదా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని హైడ్రా భావించింది. కోర్టులు భూమి యాజమాన్య హక్కుల పై విచారణ జరుపుతున్న సమయంలోనే, హైడ్రా ఆ భూమిని ప్రభుత్వ ఆస్తిగా ముందే నిర్ణయించుకుని రక్షణ చర్యలు (ఫెన్సింగ్ వేయడం వంటి వి) చేపట్టడం కోర్టు ఆదేశాల ఉల్లంఘనగా మారింది.

కోర్టులు లేదా చట్టం ప్రకారం ఏదైనా అనుమానాస్పద నిర్మాణంపై చర్యలు తీసుకునే ముందు సదరు వ్యక్తికి షోకాజ్ నోటీసు ఇవ్వాలి, వారి వివరణ వినాలి, ఆపై తుది ఆదేశాలు జారీ చే యాలి. చాలా సందర్భాల్లో హైడ్రా తక్షణ చర్యలకు దిగింది. "ఆక్రమణదారులు కోర్టుల నుండి స్టే ఆర్డర్లు తెచ్చుకుని కాలయాపన చేస్తారు" అనే ఉద్దేశంతో, నోటీసులు ఇచ్చిన 24 నుండి 48 గంటల్లోనే లేదా అసలు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలకు వెళ్ళడం వల్ల సాంకేతికంగా కోర్టు నిబంధనల ఉల్లంఘన జరిగింది. కోర్టు ఏదైనా భూమిపై 'స్టే' లేదా 'యథాతథ స్థితిని కొనసాగించాలి' అని ఆదేశించినప్పుడు, ఆ భూమిలో ఎలాంటి మార్పులు చేయకూడదు. కానీ హైడ్రా అధికారులు "మేము నిర్మాణాలను కూల్చడం లేదు, కేవలం ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ మాత్రమే వేస్తున్నాము" లేదా "అక్కడ బోర్ వెల్స్ వేస్తుంటే అడ్డుకున్నాము" అని సమర్థించుకున్నారు. ఫెన్సింగ్ వేయడం లేదా అక్కడికి సిబ్బంది వెళ్లడం కూడా 'యథాతథ స్థితి'ని మార్చడమేనని హైకోర్టు స్పష్టం చేస్తూ, హైడ్రా కోర్టు ఆదేశాలను కావాలనే బేఖాతరు చేసిందని తీవ్రంగా పరిగణించింది.

### ఇతర శాఖలతో సమన్వయ లోపం

హైడ్రా నేరుగా భూములను సర్వే చేయదు. రెవెన్యూ , జీహెచ్ ఎంసీ లేదా ఇరిగేషన్ అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగానే అది రంగంలోకి దిగుతుంది. కింది స్థాయి అధికారులు కోర్టు స్టే ఆర్డర్ల సమాచారాన్ని హైడ్రాకు సకాలంలో చేరవేయకపోవడం లేదా తప్పుడు సర్వే నంబర్ల నివేదికలు ఇవ్వడం వల్ల కూడా హైడ్రా కమిషనర్ మరియు సిబ్బంది కోర్టు ఆదేశాలు ఉన్న భూ ముల్లోకి ప్రవేశించాల్సి వచ్చింది. వేల కోట్ల ప్రజా ఆస్తిని, పర్యావరణాన్ని కాపాడాలనే సదుద్దేశంమరియు ప్రజా ప్రయోజనం ముఖ్యం తప్ప, సాంకేతిక చట్టాల సాకుతో భూమాఫియాకు సమయం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే కమిషనర్ కొన్నిసార్లు దూకుడుగా వ్యవహరించారు. అయితే న్యాయస్థానాల దఅష్టిలో ఎంతటి ప్రజా ప్రయోజనమైనా సరే "రాజ్యాంగం నిర్దేశించిన చట్ట నియమాలను" దాటి వెళ్ళకూడదు. ఒక ప్రభుత్వ సంస్థే కోర్టు ఉత్తర్వులను గౌరవించకపోతే సమాజంలో చట్టంపై నమ్మకం పోతుందని కోర్టు భావించడం వల్లే ఈ వివాదం ఇంత తీవ్రరూపం దా ల్చింది.

### కబ్జా దారులకు చట్టంలో లసుగులే బలం

తెలంగాణలో ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టీఎల్ , మరియు బఫర్ జోన్లను ఆక్రమించిన వారు హైడ్రా లేదా ప్రభుత్వ చర్యల నుండి తక్షణ ఉపశమనం పొందడానికి, కూల్చివేతలను అడ్డుకోవడానికి చట్టంలో ఉన్న కొన్ని కీలకమైన సాంకేతిక లోపాలను, లూప్‌హోల్స్‌ను ప్రధాన ఆయుధాలుగా వాడుకుంటున్నారు. చట్టం ప్రకారం ఎవరి నిర్మాణాన్ని అయినా కూల్చే ముందు వారికి ముందస్తు నోటీసు ఇచ్చి, వారి వివరణను వినాలి. హైడ్రా కొన్ని సందర్భాల్లో అత్యవసర చర్యల కింద ముందస్తు నోటీసులు ఇవ్వకుండా లేదా కేవలం 24 గంటల సమయం ఇచ్చి కూల్చివేతలకు దిగింది. దీన్ని లూప్‌హోల్‌గా మార్చుకుని "మాకు కనీస వివరణ ఇచ్చుకునే అవకాశం ఇవ్వలేదు" అని ఆక్రమణదారులు కోర్టుల నుండి ఈజీగా 'స్టే' ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. రెవె న్యూ (నాలా రికార్డులు) మరియు ఇరిగేషన్ శాఖల వద్ద ఉన్న పాత మ్యాప్‌లకు, ప్రస్తుత క్షేత్రస్థాయి సర్వే నంబర్లకు మధ్య చాలా తేడాలు ఉంటున్నాయి. అధికారులు ఒక సర్వే నంబర్‌పై నోటీసు ఇస్తే, ఆక్రమణదారులు తమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలోని మరొక సర్వే నంబర్‌ను చూపి స్తూ, "అధికారులు తప్పుడు సర్వే నంబర్ పరిధిలో ఉన్న మా చట్టబద్ధమైన ఆస్తిని కూల్చడానికి వస్తున్నారు" అని కోర్టును నమ్మించి తప్పుడు సమాచారంతో ఆర్డర్లు పొందుతున్నా రు. చాలా మంది ఆక్రమణదారులు ప్రభుత్వ విభాగాలైన హెచ్ఎండీఏ , జీహెచ్ఎంసీ, లేదా గ్రామ పంచాయితీల నుండి పొందిన భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్, మరియు సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ నుండి జరిగిన లీగల్ రిజిస్ట్రేషన్ పత్రాలను కోర్టు ముందు పెడతారు. "ప్రభుత్వ సంస్థలే మాకు అన్ని అనుమతులు ఇచ్చి, టాక్సులు వసూలు చేశాయి. ఇప్పుడు ఉన్నట్టుండి హైడ్రా వచ్చి ఇది అక్రమ నిర్మాణం అనడం చెల్లదు" అని వాదిస్తారు. తాము మోసపోయిన 'అమాయక కొనుగోలుదారులం' ) అని కలరింగ్ ఇచ్చి కోర్టుల నుండి రక్షణ పొందుతారు.

ఇరిగేషన్ చట్టాల ప్రకారం ఒక చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని ఖరారు చేస్తూ ప్రభుత్వం తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి. హైదరాబాద్‌లోని చాలా చెరువులకు కేవలం ప్రాథమిక నోటిఫికేషన్లు మాత్రమే ఉన్నాయి. చట్టబద్ధంగా పూర్తిస్థాయిలో ఎఫ్‌టీఎల్ సరిహద్దులు నిర్ణయించ కుండా, హైడ్రా ఏకపక్షంగా గూగుల్ మ్యాప్స్ ఆధారంగా బఫర్ జోన్లను నిర్ణయించి కూల్చివేయడాన్ని ఆక్రమణదారులు కోర్టులలో సవాలు చేసి విజయం సాధిస్తున్నారు.

### హైడ్రా అధికార పరిధి

హైడ్రా అనేది జీఓ ద్వారా ఏర్పడిన ఒక ఏజెన్సీ మాత్రమే. దీనికి భూములను స్వాధీనం చేసుకునే లేదా కూల్చివేసే స్వతంత్ర చట్టబద్ధమైన అధికారాలు లేవు. ఆ అధికారాలు మున్సిపల్ చ ట్టం, రెవెన్యూ చట్టం కింద కలెక్టర్లు లేదా మున్సిపల్ కమిషనర్లకు మాత్రమే ఉంటాయి. "సంబంధిత చట్టబద్ధమైన అధికారులు నోటీసులు ఇవ్వకుండా, పరిధి లేని హైడ్రా సంస్థ వచ్చి మాపై చర్యలు తీసుకోవడం చట్టవిరుద్ధం" అని లాయర్లు కోర్టులలో గట్టిగా వాదించి హైడ్రా చర్యలకు బ్రేకులు వేయిస్తున్నారు. ఒకసారి కోర్టు నుండి 'యథాతథ స్థితి' లేదా తాత్కాలిక స్టే ఆర్డర్ పొందినతర్వాత, ఆక్రమణదారులు ప్రధాన కేసు విచారణకు రాకుండా వాయిదాలు కోరుతూ కాలయాపన చేస్తారు. ఈ లోపు ఆ ఆస్తులను ఇతరులకు అమ్మేయడం లేదా కేసును ఏళ్ల తరబడి సాగదీయడం చేస్తుంటారు. ఈ చట్టపరమైన లూప్‌హోల్స్‌ను అధిగమించడానికి మరియు భూమాఫి యాకు కోర్టులలో అవకాశం లేకుండా చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం 'హైడ్రా చ ట్టం' కు అసెంబ్లీ ద్వారా పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే పనుల్లో ఉంది.

### కొత్త హైడ్రా చట్టం

తెలంగాణలో భూఆక్రమణదారులు కోర్టులను ఆశ్రయించడానికి వాడుకుంటున్న లూప్‌హోల్స్ కు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికి మరియు హైడ్రా చర్యలకు పూర్తి చట్టబద్ధత కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం చట్టపరమైన సవరణలను, ఆర్డినెన్స్‌లను మరియు కొత్త ప్రత్యేక చట్ట రూపకల్పనను వేగవంతం చేసింది. కేవలం ప్రభుత్వ జీఓ ద్వారా కాకుండా, హైడ్రాకు పూర్తి స్థాయి చట్టబద్ధమైన హోదా కల్పించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు మున్సిపల్, రెవెన్యూ, మరియు ఇరిగేషన్ శాఖలకు విడివిడిగా ఉన్న అధికారాలను ఏకీకఅతం చేస్తూ.. ఈ మూ డు శాఖల అధికారాలకు సమానమైన క్షేత్రస్థాయి అధికారాలను హైడ్రాకు కట్టబెట్టారు. దీనివల్ల "హైడ్రాకు పరిధి లేదు" అని ఆక్రమణదారులు కోర్టులలో వాదించే లూప్‌హోల్ పూర్తిగా మూ సుకుపోతుంది. జీహెచ్ఎంసీ చట్టం, 1955 కు కొత్తగా సెక్షన్ 374బీ ని చేరుస్తూ అసెంబ్లీలో సవరణ బిల్లును మరియు ఆర్డినెన్స్‌ను ఆమోదించారు. ఈ సవరణ ద్వారా ప్రజా ఆస్తులైన రోడ్లు, డ్రెయిన్లు, నీటి వనరులు (చెరువులు), మురుగు కాలువలు, మరియు పార్కులను ఆక్రమణల నుండి రక్షించడానికి.. నోటీసులు ఇవ్వడం, ఆక్రమణలను స్వయంగా తనిఖీ చేసి కూల్చివేయడంవంటి అధికారాలను నేరుగా హైడ్రా కమిషనర్‌కు బదిలీ చేశారు. హైడ్రా అధికార పరిధిని కేవ లం హైదరాబాద్ (జీహెచ్ ఎంసీ) ప్రాంతానికే పరిమితం చేయకుండా, తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలోకి మార్చారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మ ల్కాజ్‌గిరి, మరియు సంగారెడ్డి జిల్లాల్లోని ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ ఆస్తులపై హైడ్రాకు సర్వాధికారాలు లభిస్తాయి. ఆక్రమణదారులపై కేవలం సివిల్ కేసులు లేదా కూల్చివేతలతో సరిపెట్టకుండా, వారిపై నేరుగా క్రిమినల్ ప్రాసిక్యూషన్ నమోదు చేసే బలమైన నిబంధనలను తెస్తున్నారు. సికింద్రాబాద్ వంటి కీలక ప్రాంతాలలో హైడ్రాకు అంకితమైన ప్రత్యేక పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో కూల్చివేతలకు వెళ్ళినప్పుడు ఇతర పోలీస్ యంత్రాంగంపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా, తక్షణమే చట్టాన్ని అమలు చేసే వీలు కలుగుతుంది. జాతీయ విపత్తు నిర్వహణ చట్టం నిబంధనలకు అనుగుణంగా హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పించారు. నగరంలో వరదలు రాకుండా ముందే నాలాలను మరియు చెరువుల క్యాచ్‌మెంట్ ఏరియాలను రక్షించేచట్టబద్ధమైన బాధ్యతను దీనికి అప్పగించారు.: చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండేందు కు ప్రభుత్వం ఒక కీలక స్పష్టతనిచ్చింది. జులై 2024 కంటే ముందు ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న సాధారణ ఇళ్లు మరియు నివాసాలపై హైడ్రా ఎలాంటి తొందరపాటు కూల్చివేత చర్యలు తీసుకోదు. దీనివల్ల బిల్డర్ల చేతిలో మోసపోయిన అమాయక కొనుగోలుదారులకు కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చట్టంలోనే కొంత ఉపశమనం లభించింది. ఈ కొత్త చట్టపరమైన మార్పుల ద్వారా హైడ్రాకు పూర్తి "కోరలు" వచ్చినట్లయింది. ఫలితంగా భూమాఫియా సాంకేతిక లోపాలను వాడుకుని కోర్టుల నుండి స్టేలు తెచ్చుకునే వీలు చాలా వరకు తగ్గుతుంది.

### హైడ్రా నోటీసుల గడువు సమయం

హైడ్రా జారీ చేసే లేదా సిఫార్సు చేసే నోటీసుల గడువు సమయం పై స్పష్టమైన న్యాయపరమైన నిబంధనలు ఉన్నాయి. గతంలో హైడ్రా కేవలం 24 నుండి 48 గంటల సమయం ఇచ్చి కూల్చివేతలకు వెళ్లడాన్ని న్యాయస్థానాలు తీవ్రంగా తప్పుబట్టడంతో ఈ కొత్త కాలపరిమితి నిబంధనలను ఖరారు చేశారు. సాధారణ నివాసాలు, భవనాలు లేదా ప్రైవేట్ ఆస్తుల ఉల్లంఘనలపై చర్యలు తీసుకునే ముందు బాధితులకు తమ వివరణ ఇచ్చుకోవడానికి మరియు డాక్యుమెంట్లు సమర్పించడానికి 7 నుండి 15 రోజుల కనీస గడువు ఇవ్వాలి. సహజ న్యాయ సూత్రాల ప్రకారంబాధితులకు తమ లీగల్ పత్రాలను చూపించడానికి కనీసం రెండు వారాల (14 రోజులు) సమయం ఇవ్వాలని హైకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దేశవ్యాప్తంగా కూల్చివేతలపైసుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం.. ఎలాంటి అక్రమ నిర్మాణాన్ని కూల్చాలన్నా స రే కనీసం 15 రోజుల ముందస్తు నోటీసు ఖచ్చితంగా ఇవ్వాలి. ఈ 15 రోజుల గడువు ముగి సేవరకు సదరు నిర్మాణంపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదు. ఈ లోపు బాధితు లు కోర్టులను ఆశ్రయించేందుకు లేదా వివరణ ఇచ్చుకునేందుకు తగిన సమయం లభిస్తుంది. నోటీసు అందుకున్న వ్యక్తి తన వివరణను సమర్పించిన తర్వాత, ఆ కేసును పూర్తిస్థాయిలో పరిశీలించి, ఉభయ పక్షాల వాదనలు విని 4 వారాల (ఒక నెల) లోపు తుది నిర్ణయాన్ని వెల్లడించాలి. అప్పటివరకు ఆస్తిని కూల్చడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ చేయరాదు. ఏదైనా నిర్మా ణం తీవ్రంగా దెబ్బతిని, ప్రజా ప్రాణాలకు తక్షణ ముప్పుగా మారినప్పుడు (ఉదాహరణకు కూలిపోయే దశలో ఉన్న పాత భవనాలు) లేదా వరద కాలువలను (నాలాలను) పూర్తిగా మూసివేసి వరద ముప్పు తెచ్చే అత్యవసర పరిస్థితుల్లో మాత్రం ఈ 15 రోజుల గడువు వర్తించదు. అధికా రులు ముందస్తు నోటీసు లేకుండానే తక్షణమే వాటిని తొలగించవచ్చు. సాంకేతికంగా హైడ్రా నేరుగా తన పేరుతో కాకుండా, జీహెచ్ఎంసీ , రెవెన్యూ, లేదా ఇరిగేషన్ శాఖల ద్వారా ఈ నోటీసులను జారీ చేయిస్తుంది. కొత్త చట్టంలోని సెక్షన్ 374బి ప్రకారం ఈ నోటీసులపై స్పందించ డానికి బాధితులకు పైన పేర్కొన్న చట్టబద్ధమైన గడువులను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది.

### అప్పీలు దాఖలు చేయనున్న ప్రభుత్వం

హైకోర్టు డివిజన్ బెంచ్ లేదా సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేయనున్న ప్రభుత్వం ప్రధా నంగా కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాలు మరియు భూమాఫియా కుట్రలను ప్రస్తావించ నుంది. భారత రాజ్యాంగం ప్రకారం అఖిల భారత సర్వీసు అధికారుల బదిలీలు, పోస్టింగులు మరియునియామకాలు అనేవి పూర్తిగా కార్యనిర్వాహక వ్యవస్థ (రాష్ట్ర ప్రభుత్వం) పరిధిలోని ప్రత్యేక అధి కారాలు. న్యాయవ్యవస్థ నేరుగా ఒక నిర్దిష్ట అధికారిని పదవి నుండి తొలగించాలని ఆదేశించడం 'అధికారాల విభజన' సిద్ధాంతానికి విరుద్ధమని మరియు ఇది "జుడీషియల్ ఓవర్‌రీచ్" పరిధిలోకి వస్తుందని ప్రభుత్వం వాదించనుంది. లోతుకుంట భూముల వివాదంలో పిటిషనర్లు నకిలీ డాక్యుమెంట్లు, తప్పుడు సర్వే నంబర్ల రికార్డులను సఅష్టించి కోర్టులను తప్పుదోవ పట్టించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పేర్కొన్నారు. భూఆక్రమణదారులు తమ అక్రమ నిర్మాణాలను కాపాడుకోవడానికి చట్టపరమైన లూప్‌హోల్స్‌ను వాడుకుంటూ, హైడ్రాను బలహీనపరిచేందుకు కుట్రపూరితంగా వరుస కోర్టు ధిక్కరణ కేసులను అస్త్రంగా వాడుకున్నారని ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లనుంది. హైడ్రా చర్యల వెనుక ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని, స్వార్థం లేదని, కేవలం వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, ప్రజా ఆస్తులను రక్షించాలనే ఏకైక సదుద్దేశం మరియు ప్రజా ప్రయోజనం మాత్రమే ఉందని స్పష్టం చేయనుంది. కొన్ని చిన్నపాటి సాంకేతిక/పరిపాలనా లోపాలను బూచిగా చూపిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఒక పెద్ద వ్యవస్థాత్మక సంస్కరణను కుప్పకూల్చేలా సింగిల్ బెంచ్ ఉత్తర్వులు ఉన్నాయని డివిజన్ బెంచ్ ముందు వాదించనున్నారు. కమిషనర్ రంగనాథ్ కోర్టుకు స్వయంగా హాజరుకాకపోయినప్పటికీ, తన లాయర్ ద్వారా కోర్టుకు నిరుపాధిక క్షమాపణ తెలుపుతూ అఫిడవిట్ సమర్పించారు. సాధారణంగా కోర్టు ధిక్కరణ కేసులలో అధికారులు క్షమాపణలు కోరినప్పుడు కోర్టులు మందలించి వదిలేయడం లేదా జరిమానా విధించడం చేస్తాయి. కానీ, సమర్పించిన అఫిడవిట్‌ను పూర్తిగా తిరస్కరించి, ఏకంగా పదవి నుండి తొలగించాలనడం చాలా తీవ్రమైన మరియు అసాధారణమైన చర్య అని ప్రభుత్వం అప్పీల్‌లో సవాలు చేయనుంది. అధికారుల బదిలీలపై కోర్టులు పట్టుబట్టకూడదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను అప్పీల్ పిటిషన్‌లో జత చేయనున్నారు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై తక్షణ స్టే ఇవ్వాలని కోరనున్నారు.

### అప్పీలుకు సిద్ధమవుతున్న రంగనాథ్

ప్రభుత్వం దాఖలు చేసే అప్పీల్‌తో సంబంధం లేకుండా, తన కెరీర్ మరియు ఐపీఎస్ అధికారిగా తన ప్రతిష్టకు భంగం కలగకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ తనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తక్షణమే తప్పించాలని జారీ చేసిన ఉత్తర్వులపై ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వ్యక్తిగత హోదాలో హైకోర్టు డివిజన్ బెంచ్ లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి పటిష్టమైన చట్టపరమైన వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. కోర్టు తనను పదవి నుండి తొలగించాలనే ఇంత పెద్ద మరియు తీవ్రమైన శిక్షాత్మక ఆదేశం ఇచ్చే ముందు.. తనకు వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరై తన పక్షాన పూర్తి వివరణ ఇచ్చుకునే కనీస అవకాశాన్ని కల్పించకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ఆయన వాదించబోతున్నారు. ముందస్తుగా ఎలాంటి నిర్దిష్ట షోకాజ్ నోటీసు లేదా అభియోగ పత్రం లేకుండా ఏకపక్షంగా పదవి నుండి తొలగించమనడం సహజ న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని ఆయన సవాలు చేయనున్నారు. తాను తీసుకున్న ప్రతి చర్య కూడా ప్రజా ఆస్తులు మరియు చెరువుల పరిరక్షణ కోసమే తప్ప, అందులో ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదా దురుద్దేశం లేదు. ప్రభుత్వ చట్టాల ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం 'సద్బుద్ధి' తో పనిచేసే ప్రభుత్వ అధికారులకు చట్టపరమైన రక్షణ ఉంటుంది. విధుల నిర్వహణలో భా గంగా తీసుకున్న నిర్ణయాలకు గానూ ఒక అధికారిని వ్యక్తిగతంగా బాధ్యుడిని చేస్తూ పదవి నుండి తొలగించడం సివిల్ సర్వీస్ నిబంధనలకు విరుద్ధమని వాదించనున్నారు. ఐపీఎస్ అధికారుల నియామకాలు, క్రమశిక్షణా చర్యలు, బదిలీలు అన్నీ కూడా కేంద్ర హోంశాఖ మరియు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని 'సివిల్ సర్వీసెస్ బోర్డు' మార్గదర్శకాల ప్రకారం జరుగుతాయి. చారిత్రాత్మక ప్రకాష్ సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. సీనియర్ పోలీస్ అధికారుల పోస్టింగులలో కోర్టులు నేరుగా జోక్యం చేసుకోకూడదు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు ఈ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనబెట్టాయని రంగనాథ్ తన పిటిషన్‌లో పేర్కొననున్నారు. తనపై దాఖలైన 63 కోర్టు ధిక్కరణ కేసులు అన్నీ కూడా భూమాఫియా మరియు పెద్ద ఆక్రమణదారులు కుట్రపూరితంగా వేసినవే. హైడ్రాను మానసికంగా దెబ్బతీసేందుకు వారు కోర్టులను వాడుకున్నారు. వీటిని కోర్టు ధిక్కరణగా పరిగణించలేమని, క్షేత్రస్థాయిలో ఉన్న రెవెన్యూ నివేదికల ఆధారంగానే తాము చర్యలు చేపట్టామని, సాంకేతిక అంశాలను సాకుగా చూపిస్తూ ప్రజా ప్రయోజనాన్ని పక్కనబెట్టలేమని డివిజన్ బెంచ్‌కు విజ్ఞప్తి చేయనున్నారు. తాను కో ర్టు పట్ల అత్యంత గౌరవంతో ఉన్నానని, ఒకవేళ తెలియక ఏవైనా సాంకేతిక పొరపాట్లు జరిగి ఉంటే క్షమించాలని కోరుతూ ఇప్పటికే సమర్పించిన నిరుపాధిక క్షమాపణ అఫిడవిట్‌ను సింగిల్ బెంచ్ చట్టబద్ధంగా పరిగణనలోకి తీసుకోలేదని అప్పీల్‌లో ప్రస్తావించనున్నారు. ఈ వ్యక్తిగత అప్పీల్ ద్వారా రంగనాథ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై తక్షణ స్టే సాధించాలని చూస్తున్నారు.

### హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరిస్తే...

హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు వెలువడిన వెంటనే రంగనాథ్ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 ప్రకారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయవచ్చు. హైకోర్టు ఉత్తర్వుల వల్ల ఒక ఐపీఎస్ అధికారి సర్వీసు రికార్డు మరియు ప్రతిష్ట దెబ్బతింటుందని, అలాగే ఒక ప్రభు త్వ ఏజెన్సీ పనులు నిలిచిపోతాయ ని వాదిస్తూ సుప్రీంకోర్టు నుండి తక్షణ స్టే కోరవచ్చు. సా ధారణంగా హైకోర్టులు అధికారుల బదిలీలపై ఇచ్చే ఇటువంటి సంచలన ఆదేశాలపై సుప్రీంకో ర్టు త్వరగా స్పందించి స్టే ఇచ్చే అవకాశం ఉంటుంది. ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారుల నియామకాలు, బదిలీలు, పదవి నుంచి తొలగింపులు వంటి సేవా నిబంధనల వివాదాలను విచారించడానికి కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ప్రత్యేక చట్టబద్ధమైన వేదిక. ర్టులు తనను పదవి నుండి తప్పించాలని ఆదేశించడం ఐపీఎస్ క్యాడర్ రూల్స్, 1954 మరియు సివిల్ సర్వీసెస్ నిబంధనలకు విరుద్ధమని రంగనాథ్ క్యాట్ లో పిటిషన్ వేయవచ్చు. ఒకవేళ డివిజన్ బెంచ్ తీర్పులో క్షేత్రస్థాయి వాస్తవాలను లేదా ఏదైనా చట్టపరమైన నిబంధనను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని భావిస్తే, అదే బెంచ్ ముందు రివ్యూ పిటిషన్ (పునఃసమీక్ష పిటిషన్) దాఖలు చేయవచ్చు. అయితే, రివ్యూ పిటిషన్ల ద్వారా తీర్పులు మారే అవకాశం చాలా తక్కువ కాబట్టి, అధికారులు నేరుగా సుప్రీంకోర్టుకే ప్రాధాన్యత ఇస్తారు. ఐపీఎస్ అధికారులకు కేంద్ర హోంశాఖ క్యాడర్ నియంత్రణ సంస్థగా ఉంటుంది. కోర్టు ఆదే శాల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం రంగనాథ్‌కు అండగా నిలుస్తూ ఆయనను లీగల్ ప్రాసెస్ ముగిసేవరకు వేరే లూప్-లైన్ పోస్టింగ్‌కు బదిలీ చేసి, ఆ తర్వాత సుప్రీంకోర్టు తీర్పును బట్టి తిరిగి నియమించేలా రాజకీయ/పరిపాలనాపరమైన నిర్ణయం తీసుకోవచ్చు. రంగనాథ్ ఐపీఎస్ అధికారి కావడంతో పాటు, ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిగా ఆయన వెంటే ఉంది. అందువల్ల హైకోర్టు డివిజన్ బెంచ్ అప్పీల్ తిరస్కరిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మరియు రంగనాథ్ ఇద్దరూ కలిసి ఉమ్మడిగా లేదా విడివిడిగా సుప్రీంకోర్టులో సవాలు చేయడం అత్యంత ఖాయమైన తదుపరివ్యూహం.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999